RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD సంపుటి : 10 సంచిక : 361 శనివారం 02 - 08 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

# ఢిల్లీ ఫ్లైటెక్కిన సీఎం రేవంత్..

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీకి పయనమయ్యారు
- పర్యటనలో భాగంగా, ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరగనున్న న్యాయ సదస్సులో సీఎం పాల్గొననున్నారు
- ఈ సదస్సును ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ న్యాయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది
- మానవ హక్కులు, సమాచార హక్కు చట్టం వంటి కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి
- సదస్సుకు ఏఐసీసీ ప్రముఖ నేతలు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు రాజ్యసభ సభ్యులు హాజరుకానున్నారు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీకి పయనమయ్యారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఢిల్లీ బయలుదేరగా, శనివారం సాయంత్రం తిరిగి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఈ పర్యటనలో భాగంగా, ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో జరగనున్న న్యాయ సదస్సులో సీఎం పాల్గొననున్నారు. ఈ సదస్సును ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ న్యాయ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తోంది. ఇందులో మానవ హక్కులు, సమాచార హక్కు చట్టం వంటి కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. సదస్సుకు ఎఐసీసీ ప్రముఖ నేతలు, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు రాజ్యసభ సభ్యులు హాజరుకానున్నారు. ముఖ్యంగా, ఈ సదస్సును రాజ్యసభ సభ్యుడు డా. అభిషేక్ మనుసింగ్వీ నేతృత్వంలో నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా న్యాయపరంగా ఎదురవుతున్న సవాళ్లు, ప్రజాస్వామ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలపై కీలక చర్చలు జరగనున్నట్లు - మిగతా 2 లో

# బనకచర్ల కట్టి తీరుతామని లోకేశ్ చెబుతున్నారు



**రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లించే పనిలో ఉన్నారు**

**కేంద్ర ప్రభుత్వంలో ఉన్నామనే ధైర్యంతో లోకేశ్ మాట్లాడుతున్నారన్న హరీశ్ రావు**

**కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీత**

**లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని ఆరోపణ**

**మంత్రి నారా లోకేశ్ బనకచర్ల ప్రాజెక్టును కట్టి తీరుతామని చెబుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు**

కేంద్ర ప్రభుత్వంలో ఉన్నామనే ధైర్యంతో ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ బనకచర్ల ప్రాజెక్టును కట్టి తీరుతామని చెబుతున్నారని బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాజెక్టును కట్టి తీరుతామని లోకేశ్ మాట్లాడుతుంటే తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. 'మా తెలంగాణ హక్కుల సంగతి ఏమిటి' అని ముఖ్యమంత్రి, నీటి పారుదల - మిగతా 2 లో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేరిన కాళేశ్వరం కమిషన్ నివేదిక



**కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణ చేపట్టిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్**

**గురువారం నివేదికను నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శికి అందజేత**

**ముఖ్యమంత్రికి అందజేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కాళేశ్వరం కమిషన్ నివేదిక అందింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈ నివేదికను ముఖ్యమంత్రికి అందజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ చేపట్టారు. దీనికి సంబంధించిన నివేదికను గురువారం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు అందజేశారు. ఈ రోజు ఆ నివేదిక ముఖ్యమంత్రికి చేరింది.కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అనేక వైఫల్యాలు ఉన్నాయని, - మిగతా 2 లో

# రాజధాని నగరంలో సిగరెట్ తాగకుండానే లంగ్ క్యాన్సర్!


- ఢిల్లీలో తీవ్రస్థాయిలో వాయు కాలుష్యం
- పొగతాగని వారిలోనూ ఊపిరితిత్తుల క్యాన్సర్
- నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరుతున్న కాలుష్య కణాలు
- వాహనాల నుంచి వచ్చే పొగ, పరిశ్రమల నుంచి వెలువడే వాయువులు, నిర్మాణ పనుల వల్ల వచ్చే ధూళి, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే పొగ.. ఇవన్నీ గాలి నాణ్యతను దారుణంగా దిగజారుస్తున్నాయి



సాధారణంగా సిగరెట్, బీడీలు, చుట్టలు తాగే వారిలో అధికంగా లంగ్ క్యాన్సర్ కనిపిస్తుందని తెలిసిందే. కానీ దేశ రాజధాని ఢిల్లీలో నివసించే ప్రజలు కేవలం పొగతాగడం వల్ల మాత్రమే కాకుండా, పెరిగిపోతున్న వాయు కాలుష్యం కారణంగా కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురవుతున్నారని నివేదికలు చెబుతున్నాయి. - మిగతా 2 లో

# ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్ భారత్ కంటే అమెరికాకే అధిక నష్టం

- ట్రంప్ సుంకాల ప్రభావం అమెరికా ప్రజల పైనే ఎక్కువగా ఉండవచ్చని ఎస్బీఐ రీసెర్చ్ నివేదిక
- ఒక్కో కుటుంబంపై ఏడాదికి సగటున 2,400 డాలర్ల భారం పడుతుందని అంచనా,భారతీయ కరెన్సీలో సుమారు రూ. 2 లక్షలు
- అంతర్జాతీయ ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగా ఉందని వెల్లడి
- భారత్ సహా దాదాపు 70 దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధిక టారిఫ్ విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు
- ట్రంప్ అధిక సుంకాల నిర్ణయం భారత్ సహా ఇతర దేశాల కంటే అమెరికాకే ఎక్కువ నష్టం కలిగించే అవకాశం ఉందని ఈ నివేదిక అభిప్రాయపడింది



భారత్ సహా దాదాపు 70 దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధిక టారిఫ్ విధిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఆయా దేశాలపై భారీ సుంకాలు, జరిమానాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ట్రంప్ విధిస్తున్న సుంకాల ప్రభావం అమెరికా ప్రజల పైనే ఎక్కువగా ఉంటుందని తాజా నివేదిక ఒకటి వెల్లడించింది. ట్రంప్ ప్రకటించిన అధిక సుంకాల కారణంగా అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగి అక్కడి కుటుంబాలకు భారంగా మారనుందని ఎస్బీఐ రీసెర్చ్ నివేదిక తెలిపింది. ఒక్కో కుటుంబంపై 2,400 డాలర్ల భారం పడుతుందని అంచనా వేసింది. ఇది భారతీయ కరెన్సీలో సుమారు రూ. 2 లక్షలు.ట్రంప్ సుంకాల ప్రభావం ఆయా ఆదాయ వర్గాలపై భిన్నంగా ఉండవచ్చని పేర్కొంది. అల్పాదాయ కుటుంబాలపై 130 డాలర్లు, అధిక ఆదాయ కుటుంబాలపై 5 వేల డాలర్ల వరకు భారం పడుతుందని - మిగతా 2 లో

## జగన్ నెల్లూరు పర్యటనపై మూడు కేసుల నమోదు




**నిన్న నెల్లూరులో పర్యటించిన జగన్**

**వైసీపీ నేతలు, కార్యకర్తలు నిబంధనల ఉల్లంఘన**

**మూడు కేసులు నమోదు చేసిన పోలీసులు**

## అన్నదాత సుఖీభవ పథకం కేంద్రంతో ముడిపెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాలి




**చంద్రబాబు ఎన్నికల వేళ రైతుకు**


**రూ॥20 వేలు ఇస్తామన్నారన్న షర్మిల**

**ఇప్పుడు కేంద్రం నిధులతో**

**ముడిపెడుతున్నారని విమర్శలు**

**రైతుకు నేరుగా రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్**

# అమెరికాకు షాక్ ఇచ్చిన భారత్ ఎఫ్35 యుద్ధ విమానాల డీల్‌కు బ్రేక్ !



**అమెరికాతో కొత్త రక్షణ ఒప్పందాలు చేసుకునేందుకు భారత్ విముఖత**

**ఎఫ్-35 యుద్ధ విమానాల కొనుగోలుపై ఆనాసక్తి**

**ట్రంప్ రివెంజ్ టారిఫ్‌లకు ప్రతీకారంగా!**

**భారత్‌పై 25శాతం టారిఫ్‌లతోపాటు, పెనాల్టీ విధిస్తూ ం**

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల వివాదానికి తెరలేపారు**

**దే సమయంలో భారత్ ప్రాధాన్యతలకు అనుగుణంగా రష్యా కీలకమైన**

**కొత్త ప్రతిపాదనను తీసుకొచ్చింది**

**జులైలో SU-57E, SU-35M మల్టీరోల్ ఎయిర్ సుపీరియారిటీ**

**ఎయిర్‌క్రాఫ్ట్‌లు అందించేందుకు రష్యా ముందుకొచ్చింది**


భారత్‌కు తన రక్షణ రంగ ఎగుమతులను మరింత విస్తరించాలని భావిస్తున్నఅమెరికాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇరుదేశాల మధ్య కుదిరిన ఎఫ్-35 యుద్ధ విమానాల డీల్‌కు బ్రేకులు పడినట్లు తెలుస్తోంది. ఎఫ్-35 విమానాల కొనుగోలుపై భారత్ ఆసక్తి చూపడం లేదని బ్లూమ్‌బర్గ్ ఓ కథనాన్ని ప్రచురించింది. ప్రస్తుతం సుంకాల వివాదం నెలకొన్న నేపథ్యంలో రక్షణ రంగ ఒప్పందాల ఆమోదం విషయంలో భారత్ ముందుకెళ్లాలనుకోవడం లేదని వెల్లడించింది. ఇదే సమయంలో భారత్ ప్రాధాన్యతలకు అనుగుణంగా రష్యా కొత్త ప్రతిపాదనను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

**టారిఫ్ వార్ ఎఫెక్ట్**

భారత్‌పై 25శాతం టారిఫ్‌లతోపాటు, పెనాల్టీ విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల వివాదానికి తెరలేపారు. ఈ చర్యలతో అసంతృప్తితో ఉన్న భారత్ రక్షణ రంగ ఒప్పందాల ఆమోదం విషయంలో ముందుకు - మిగతా 2 లో

# ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- టీడీపీ శ్రేణులతో సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్
- హాజరైన మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, జోనల్ కో-ఆర్డినేటర్లు, రైతు సంఘం నేతలు
- అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకం, 'సుపరిపాలనలో తొలిఅడుగు'పై దిశానిర్దేశం
- గత ప్రభుత్వంతో పోలిస్తే, తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను రెండింతలు అందిస్తోందని చంద్రబాబు తెలిపారు
- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు



ప్రజలకు మంచి చేసే పాలన అందించాల్సిన బాధ్యత తమదైతే, ఆ మంచిని సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ యంత్రాంగానిదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం మంత్రులు, టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, జోనల్ కో-ఆర్డినేటర్లు, రైతు సంఘం నేతలతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రేపు ప్రారంభం కానున్న 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకం, 'సుపరిపాలనలో తొలిఅడుగు' వంటి అంశాలపై ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. వైసీపీ చేస్తున్న - మిగతా 2 లో

# సంపాదకీయం

## దళిత సాహిత్య వైతాళికుడు



ఆధిపత్య వర్గాల ధోరణి బహుజనులను విద్యకు దూరం చేయడంతో దేశ స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తరువాత ఎంతో మంది అక్షర జ్ఞానానికి దూరమయ్యారు. అయినా, జ్యోతిబా పూలే, బి.ఆర్. అంబేద్కర్ వంటి ఎందరో మహనీయులు విద్యావంతులుగా మారి సమాజానికి వెలుగులు పంచారు. వీరిలో అన్నాభావు సాఠె ఒకరు. అందరిలా బడికి వెళ్లి చదువుకునే అవకాశం లేకపోయినా, జీవితమనే పాఠశాలలో విద్యార్థిగా చేరి 'విద్యా జ్ఞానం అన్ని సమస్యలకు దివ్య ఔషధం' అనే ముక్తా సాల్వె మాటలను ప్రేరణగా తీసుకుని, అక్షర జ్ఞానియై సాహిత్య సమ్రాట్‌గా ప్రసిద్ధిచెందారు. దేశ విదేశీయులతో 'అన్నా' అని పిలుపునందుకున్న మొదటి భారతీయుడు అన్నాభావు సాఠె.ఆయన అసలు పేరు 'తుకారాం భావురావ్ సాఠె'. మహారాష్ట్ర, వాటేగావ్ గ్రామంలో ఉన్న మాంగ్ వాడాలో 1920 ఆగస్టు 1న జన్మించారు. అన్నా చిన్నప్పుడు అభంగ్స్ (భక్తి పాటలు)ను లయబద్ధంగా పాడేవారు. వంశపారంపర్యంగా బంధువులు నిర్వహించే 'తమాషా' ప్రదర్శనలలో చురుకుగా పాల్గొని, జానపద వాయిద్యాలు వాయించడం, పాటలు పాడటం నేర్చుకున్నారు. కత్తి, ఈటె, బాకు, దాండ్ పట్టా, కర్రసాము యుద్ధ కళను తమాషాలకు జోడించి, బహుళ ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో విశేషకృషి చేశారు. పదేళ్ళ వయస్సులో స్వాతంత్ర్యోద్యమంలో కూడా పాల్గొన్నాడు. బతుకుతెరువు కోసం కుటుంబం బొంబాయికి వలస వచ్చినపుడు ఒక సినిమా థియేటర్‌లో డోర్ కీపర్‌గా పని చేయడం అన్నా జీవితాన్ని మార్చేసింది. సినిమాల ప్రభావంతో దుకాణాలు, హోటళ్లు, సినిమా పోస్టర్లపై ఉన్న అక్షరాలను చదవడానికి యత్నిస్తూ చదవడం, రాయడం నేర్చుకున్నారు. మొదట్లో విలేకరిగా పనిచేస్తూ స్వీయ అనుభవాలు, నిజ ఘటనల ఆధారంగా కథలు రాసేవారు. సాంస్కృతిక చైతన్యం ద్వారా స్వాతంత్ర్యోద్యమంలో సామాన్య ప్రజలను భాగస్వాములను చేసేందుకు 1943లో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఏర్పాటులో ముఖ్యపాత్ర వహించిన అన్నా, తన ఇద్దరు సహచరులతో 1944లో 'రెడ్ ఫ్లాగ్ కల్చరల్ స్క్వాడ్' అనే కొత్త తమాషా బృందాన్ని ఏర్పాటు చేసి, హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. తన పాటలు, మాటలతో ప్రజలను ఉర్రూతలూగించడంతో, ప్రజలు ఆయనను 'లోక్ షాహిర్' అని పిలిచేవారు. కొంతకాలం తర్వాత ప్రభుత్వం తమాషాలను నిషేధించింది. లాల్ బావతా కళాపథక్ కోసం రాసిన నాటకాలను 'లావని' (మహారాష్ట్రలో ప్రసిద్ధిగాంచిన సంగీత నృత్య ప్రదర్శన), 'పోవాడా' (జానపద పాటలు) రూపంలోకి మార్చారు.రష్యా విప్లవం విజయగాథను వివరిస్తూ 'స్టాలిన్ గ్రాడ్' నాటకాన్ని రాయగా, అది రష్యన్ భాషలోకి అనువాదమైంది. అన్నా 1961లో రష్యాను సందర్శించారు. ఆ ప్రయాణ అనుభవాలను 'మాజా రష్యా చా ప్రవాస్' రూపంలో గ్రంథస్థం చేసిన మొదటి వ్యక్తిగా ఆశ్రితవర్గాల నుంచి చరిత్రకెక్కారు. తన జీవితకాలంలో నవలలు, చిన్న కథల సంకలనాలు, నాటకాలు వంటి 100కు పైగా రచనలు చేశారు. ఇవి రష్యన్, ఫ్రెంచ్, జర్మన్, చెక్, ఇంగ్లీష్, స్పానిష్ మొదలైన 27 అంతర్జాతీయ భాషల్లోకి అనువాదమై, ఆయన కీర్తిప్రతిష్ఠలు విదేశాలలో కూడా ప్రజ్వరిల్లాయి. బాబాసాహెబ్ భావజాలం వైపు మొగ్గు చూపి, బడుగు బలహీన కార్మిక వర్గాలను చైతన్యపరిచే రచనలు చేశారు. 'ఫకీరా' నవలను బాబాసాహెబ్‌కు అంకితం చేశారు అన్నా. రష్యాలో సినిమా నటుడు రాజ్‌కపూర్‌తో పాటు విపరీతమైన అభిమానులు కలిగిన మరొక భారతీయుడు అన్నా భావు సాఠె అని తెలుసుకొని అప్పటి భారత ప్రధాని నెహ్రూ ఆశ్చర్యానికి గురయ్యారు. 1958లో బొంబాయిలో తన అధ్యక్షతన నిర్వహించిన 'మొదటి దళిత సాహిత్య సమ్మేళనం' ప్రారంభ ప్రసంగంలో "ఈ భూమి శేష్‌నాగ్ అని పిలిచే పాము తలపై కాకుండా దళిత, బహుజన వర్గాల శ్రమ శక్తి మీద సమతుల్యతతో నిలిచివుంది" అని ప్రకటించారు. అన్నాభావు రచించిన అనేక నవలలు, కథల ఆధారంగా అనేక చలన చిత్రాలు నిర్మించారు, ఇంకా నిర్మిస్తూనే ఉన్నారు.రష్యాలో అన్నా పేరుమీద స్కాలర్‌షిప్ ఇవ్వడం మామూలు విషయం కాదు. కవి, రచయిత, విలేకరి, కార్మికుడు, నటుడు, దర్శకుడు, స్క్రీన్‌ప్లే రచయిత ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన అన్నా సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం వివిధ కట్టడాలకు, సంస్థలకు ఆయన పేరు పెట్టి గౌరవించింది. ఇటీవల మహాత్మా గాంధీ మెమోరియల్ విశ్వవిద్యాలయం మరణానంతరం అన్నా భావు సాఠెకు 'డాక్టరేట్'ను ప్రదానం చేసింది. రష్యా రాజధాని 'మాస్కో'లో అన్నా విగ్రహాన్ని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. పాఠశాలలో విద్యాభ్యాసం చేయకుండానే తన రచనల ద్వారా గ్రామీణ వ్యవస్థ, బడుగు బలహీన, మహిళా, కార్మిక వర్గాల స్థితిని కళ్ళకు కట్టినట్టు బహిర్గతం చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. దళిత సాహిత్య పితామహుడిగా, సాహిత్య సమ్రాట్‌గా ప్రసిద్ధి చెందిన అన్నాకు 'భారతరత్న' ఇవ్వాలని ఆయన అభిమానులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అలాగే అధికారికంగా ఆయన జయంతిని జరపాలని కోరుతున్నారు.

## ట్రంప్ టారిఫ్ ఎఫెక్ట్.. భారత్ కంటే అమెరికాకే అధిక నష్టం

అంచనా వేసింది. సగటున ఇది 2,400 డాలర్లుగా ఉండవచ్చని అంచనా వేసింది.ట్రంప్ అధిక సుంకాల నిర్ణయం భారత్ సహా ఇతర దేశాల కంటే అమెరికాకే ఎక్కువ నష్టం కలిగించే అవకాశం ఉందని ఈ నివేదిక అభిప్రాయపడింది. ఖర్చులు పెరిగి, డిమాండ్ తగ్గుతుందని, అది అమెరికా ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుందని పేర్కొంది. ట్రంప్ నిర్ణయం కారణంగా అమెరికా జీడీపీ వృద్ధి 40 నుంచి 50 బేసిస్ పాయింట్లు తగ్గే అవకాశం ఉందని అంచనా వేసింది.సుంకాల పెరుగుదలతో అమెరికాతో పాటు భారత్ కూడా సవాళ్లను ఎదుర్కొంటుందని ఈ నివేదిక స్పష్టం చేసింది. అయితే, సుంకాల ప్రభావంతో డాలర్ క్షీణించే అవకాశం ఉంటుందని, ద్రవ్యోల్బణం పెరగవచ్చని... వీటిని పరిగణనలోకి తీసుకుంటే భారత్ కంటే అమెరికానే బలహీనస్థితిలోకి వెళుతుందని అంచనా వేసింది. అంతర్జాతీయ ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు భారత్ సిద్ధంగానే ఉందని పేర్కొంది.

## జగన్ నెల్లూరు పర్యటనపై మూడు కేసుల నమోదు

వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ నెల్లూరు పర్యటన సందర్భంగా మూడు పోలీసు కేసులు నమోదయ్యాయి.జగన్ పర్యటనలో వైసీపీ నేతలు, కార్యకర్తలు నిబంధనలు ఉల్లంఘించడంతో పోలీసులు ఈ కేసులు నమోదు చేశారు.మాజీ మంత్రి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటికెళ్లే రోడ్డు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను వైసీపీ నాయకులు, కార్యకర్తలు లాగిపడేసి.. పరుగులు తీశారు. దాంతో కావలికి చెందిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్య బారికేడ్ కింద పడిపో వడంతో చేయి విరిగింది. ఈ ఘటనలో ప్రసన్న, బొబ్బల శ్రీనివాస్ యాదవ్, పాతపాటి ప్రభాకర్ తదిత రులపై పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ పర్యటన సందర్భంగా రోడ్డుపై ధర్నా చేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించినందుకు ప్రసన్నకుమార్‌రెడ్డి, మరికొందరిపై దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశా రు. నిబంధనలకు విరుద్ధంగా బైక్ ర్యాలీ చేపట్టినందుకు దర్గామిట్ట పోలీసులు మరో కేసు నమోదు చేశారు.

## ఢిల్లీ ఫ్లైటెక్కిన సీఎం రేవంత్

సమాచారం.సదస్సు అనంతరం సీఎం రేవంత్ రెడ్డి తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల అంశంపై రాష్ట్రంలో జరుగనున్న ఆందోళన కార్యక్రమం నేపథ్యంలో, ఆయన ఆగస్టు 4న తిరిగి రాష్ట్ర ప్రజల ముందుకు రానున్నారు.ఁ

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేరిన కాళేశ్వరం కమిషన్ నివేదిక

దీనికి కింది స్థాయి నుంచిఉన్నత స్థాయి వరకు పలువురు బాధ్యులని నివేదికలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. వ్యవస్థాగత విధానాలకు విరుద్ధంగా వ్యక్తుల ఇష్టానుసారం పనులు జరిగాయని, ఉన్నతస్థాయి ఒత్తిడులకు తలొగ్గి నిబంధనలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకున్నారని, ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నాయని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం.

# ప్రభుత్వం చేస్తున్న మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మొదటిపేజీ తరువాయి -

**అన్నదాత సుఖీభవతో రైతులకు భారీ సాయం**


తమ ప్రభుత్వం చెప్పిన హామీలను అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకాన్ని ప్రారంభిస్తున్నామని, దీని ద్వారా అర్హుడైన ప్రతి రైతుకు ఏడాదికి రూ. 20,000 అందిస్తున్నామని చెప్పారు. మొదటి విడతగా, రాష్ట్ర వాటా రూ. 5,000, కేంద్రం వాటా రూ. 2,000 కలిపి మొత్తం రూ. 7,000 జమ చేస్తామని తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 46,85,838 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని, దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 2,342.92 కోట్లు విడుదల చేసిందని వివరించారు.అర్హులైన రైతుల పేర్లు లబ్ధిదారుల జాబితాలో ఉండేలా ఎమ్మెల్యేలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఒకవేళ ఎవరైనా అర్హులు మిగిలిపోతే, 155251 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రైతులకు ప్రభుత్వం చేస్తున్న ఈ మేలును పార్టీ యంత్రాంగం ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. గత ప్రభుత్వం రైతులకు అరకొర సంక్షేమం చేసిందని, పంటల బీమాకు ప్రీమియం చెల్లించకుండా రైతులనునిరాశపరిచిందని విమర్శించారు.

**సంక్షేమం రెండింతలు, ఆనందం రెండింతలు**

గత ప్రభుత్వంతో పోలిస్తే, తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలను రెండింతలు అందిస్తోందని చంద్రబాబు తెలిపారు. ఈ నెలలోనే సూపర్ సిక్స్ లోని రెండు హామీలను నెరవేరుస్తున్నామని చెప్పారు. అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయడంతో పాటు, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు.వృద్ధులు, వితంతువులకు నెలకు రూ. 4,000, దివ్యాంగులకు రూ. 6,000, మంచానికే పరిమితమైన వారికి రూ. 15,000 పింఛను ఇస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం రద్దు చేసిన అన్న క్యాంటీన్లను పునరుద్ధరించామని, ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం చేసే మంచి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సింది పార్టీ కార్యకర్తలేనని, నిత్యం ప్రజల్లో ఉండాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.

**వైసీపీ కుట్రలను ప్రజలకు వివరించండి**

కూటమి ప్రభుత్వం సంక్షేమం చేస్తుంటే, కొందరు



ఓర్చుకోలేకపోతున్నారని చంద్రబాబు విమర్శించారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, ఇప్పుడు కూడా కుట్రలు పన్నుతూ అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తు న్నారని అన్నారు. ఈ కుట్రల వల్ల రాష్ట్రానికి, ప్రజలకు ఎలాంటి నష్టం జరుగుతుందో ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులను కోరారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా కోటి కుటుంబాలను కలవడమే కాకుండా, వారి మనసులను కూడా గెలుచుకోవాలని సీఎం సూచించారు. గతంలో మంచిని చెప్పుకోవడంలో విఫలమయ్యామని, ఇప్పుడు అలా జరగకూడదని స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరినీ గుర్తిస్తున్నామని, వారికి నామినేటెడ్ పదవులు ఇస్తున్నామని చెప్పారు. పార్టీ కార్యకర్తలే ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధానకర్త అని, వారే ప్రజల మనసు గెలుచుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# అమెరికాకు షాక్ ఇచ్చిన భారత్ - ఎఫ్35 యుద్ధ విమానాల డీల్‌కు బ్రేక్!

మొదటిపేజీ తరువాయి - వెళ్లాలనుకోవడం లేదని బ్లూమ్‌బర్గ్ తెలిపింది. ట్రంప్ సుంకాలకు భారత్ తక్షణమే దీటుగా బదులిచ్చే యోచన చేయడం లేదని, అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగించాలని కోరుకుంటోందని ఆ కథనంలో వెల్లడించింది. అయితే కొత్త రక్షణ ఒప్పందాలను భారత్ ఆమోదించే అవకాశం లేదని తెలుస్తోంది. ఎఫ్-35 యుద్ధ విమానాల కొనుగోలుపై ఆసక్తి లేదని అమెరికా అధికారులకు భారత్ చెప్పినట్లు బ్లూమ్‌బర్గ్ వెల్లడించింది. ఈ పరిణామంతో భారత్‌కు తన రక్షణ రంగ ఎగుమతులను మరింత విస్తరించాలని భావిస్తోన్న అమెరికాకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లేనని రక్షణ రంగ నిపుణులు అంటున్నారు.

**స్వదేశీ యుద్ధ విమానాల తయారీపై భారత్ దృష్టి!**

స్వదేశీ పరిజ్ఞానం, దేశీయ తయారీపై దృష్టి పెట్టడమే అమెరికా డీల్‌పై భారత్ ఆసక్తి చూపకపోవడానికి మరో కారణంగా తెలుస్తోంది. దేశీయంగా రక్షణ పరికరాలను సంయుక్తంగా తయారు చేయడం, రూపొందించడంపై దృష్టి సారించే ఒప్పందాలపైనే ఇండియా ఎక్కువ ఆసక్తి చూపుతుందని రక్షణశాఖ అధికారులు వెల్లడించినట్లు బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. సాంకేతిక పరిజ్ఞాన భాగస్వామ్యం, స్థానికంగా తయారీ, స్వదేశీ సామర్థ్య అభివృద్ధికి భారత్ కట్టుబడి ఉందని వారు చెప్పినట్లు వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటన సందర్భంగా, శత్రుభీకరమైన ఎఫ్?-35 యుద్ధవిమానాలను విక్రయించేందుకు యూఎస్ అంగీకరించింది .మోదీతో భేటీ అనంతరం ట్రంప్ డీల్‌పై ప్రకటన చేశారు.

**భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్?!**

ఇదే సమయంలో భారత్ ప్రాధాన్యతలకు అనుగుణంగా రష్యా కీలకమైన కొత్త ప్రతిపాదనను తీసుకొచ్చింది. ఈ జులైలో SU-57E, SU-35M మల్టీరోల్ ఎయిర్ సుపీరియారిటీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు అందించేందుకు రష్యా ముందుకొచ్చింది. ఇందులో భాగంగా భారత్‌లోనే తయారు చేసుకునేందుకు యుద్ధ



విమానానికి సంబంధించి పూర్తి సాంకేతికత బదిలీ చేస్తామని రష్యా ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనను రష్యన్ రక్షణ సంస్థ రోస్టెక్, విమానాల తయారీ సంస్థ సుఖోయ్ సమర్పించాయి. వచ్చే మూడు నాలుగేళ్లలో 20 నుంచి 30 వరకు %ూఖ-57జు% యుద్ధ విమానాల డెలవరీ చేసేలా ప్రతిపాదన చేశాయి. తర్వాత స్థానికంగా 2030 నాటికి 70 నుంచి 100 యుద్ధ విమానాలను ఉత్పత్తి చేసుకోవచ్చు. అంతేకాదు క్షీణిస్తున్న భారత స్క్వాడ్రన్ బలాన్ని తిరిగి పెంచేందుకు ఎఫ్-35 ఎయిర్‌కాఫ్ట్‌లను ఇచ్చేందుకు కూడా రష్యా ప్రతిపాదించింది. ఇప్పటికే నాసిక్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ తయారీ కేంద్రంలో 220కి పైగా SU-30 MKI విమానాలను తయారు చేశారు. తాజా డీల్‌కు భారత్ అంగీకరిస్తే స్థానికీకరణ రేటు 60 శాతానికి చేరే అవకాశం ఉంది.

# రాజధాని నగరంలో సిగరెట్ తాగకుండానే లంగ్ క్యాన్సర్!



మొదటిపేజీ తరువాయి - వైద్య నిపుణుల ప్రకారం, గతంతో పోలిస్తే పొగతాగని వారిలో కూడా లంగ్ క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరిగాయి. దీనికి ప్రధాన కారణం నగరంలోని ప్రమాదకరమైన వాయు కాలుష్యమే.ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ప్రమాణాల ప్రకారం, గాలిలో కాలుష్య కణాల (పీఎమ్ 2.5) స్థాయి చాలా ఎక్కువగా ఉంది. ఈ సూక్ష్మ కణాలు శ్వాస తీసుకున్నప్పుడు నేరుగా ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించి, వాటి కణజాలంపై హానికరమైన ప్రభావాన్ని చూపుతాయి. ఈ కణాలు ఊపిరితిత్తుల కణాలను దెబ్బతీయడం వల్ల కాలక్రమేణా క్యాన్సర్‌గా మారే అవకాశం ఉంది.ఢిల్లీలో నివసించే ప్రజలు, ముఖ్యంగా పొగతాగని వారు ఊపిరితిత్తుల క్యాన్సర్ బారిన పడటానికి గల కారణాలను వైద్య నిపుణులు ఇలా వివరిస్తున్నారు:

**వాయు కాలుష్యం:** వాహనాల నుంచి వచ్చే పొగ, పరిశ్రమల నుంచి వెలువడే వాయువులు, నిర్మాణ పనుల వల్ల వచ్చే ధూళి, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వచ్చే పొగ.. ఇవన్నీ గాలి నాణ్యతను దారుణంగా దిగజారుస్తున్నాయి.

**సైలెంట్ కిల్లర్:** పొగతాగని వారికి వచ్చే ఊపిరితిత్తుల క్యాన్సర్‌ను గుర్తించడం చాలా కష్టం. దీని లక్షణాలు చాలా ఆలస్యంగా, అంటే వ్యాధి తీవ్ర దశకు చేరుకున్నాకే బయటపడతాయి. దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ నొప్పి వంటివి సాధారణంగా కనిపించే లక్షణాలు.

**ఎక్కువ రిస్క్ ఉన్నవారు:** వృద్ధులు, పిల్లలు, మరియు ఇప్పటికే శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు ఈ కాలుష్యం వల్ల ఎక్కువ ప్రమాదంలో ఉంటారు.

**ఈ ప్రమాదకరమైన పరిస్థితి నుంచి బయటపడటానికి వైద్యులు కొన్ని జాగ్రత్తలను సూచిస్తున్నారు:**మాస్కులు ధరించడం: కాలుష్యం ఎక్కువగా ఉన్న రోజుల్లో బయటికి వెళ్ళినప్పుడు ఎన్-95 మాస్కులు ధరించడం మంచిది.ఎయిర్ ప్యూరిఫైయర్‌లు: ఇంట్లో గాలి నాణ్యతను మెరుగుపరచడానికి ఎయిర్ ప్యూరిఫైయర్‌లను ఉపయోగించడం.వ్యాయామం: క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తిని పెంచుకోవాలి.నివారణ చర్యలు: కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతు ఇవ్వాలి.ఢిల్లీలో ఈ పరిస్థితి చూస్తుంటే, వాయు కాలుష్యం ఒక ఆరోగ్య సమస్య మాత్రమే కాదు, ఒక సామాజిక సమస్యగా కూడా మారిందని అర్థమవుతోంది. ఇది ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోంది.

# అన్నదాత సుఖీభవ పథకం కేంద్రంతో ముడిపెట్టకుండా రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాలి

మొదటిపేజీ తరువాయి - ఏపీలోని కూటమి ప్రభుత్వంపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబు ఇచ్చేది అన్నదాత సుఖీభవ కాదని, అన్నదాత దుఃఖీభవ అని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు అందరికీ కాదని, కొందరికేనని ఆరోపించారు. ఏపీలో 76.07 లక్షల మంది రైతులుంటే చంద్రబాబు సర్కారు ఎంపిక చేసింది కేవలం 47 లక్షల మందినే అని వెల్లడించారు. వడపోతల పేరుతో 30 లక్షల మంది రైతులకు టోకరా వేశారని షర్మిల మండిపడ్డారు. "ఇప్పటికే గ్యాస్ సిలిండర్లు సగం మందికే ఇస్తున్నారు... తల్లికి వందనం కింద 20 లక్షల మంది బిడ్డలకు కోత పెట్టారు... ఇప్పుడు సుఖీభవ పేరుతో రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వమే రూ.20 వేలు ఇస్తుందని ఎన్నికల ప్రచారంలో బాబు ఊదరగొట్టారు.కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో



ముడిపెట్టారు.కేంద్రం ఇచ్చే రూ.6 వేలు పక్కన బెడితే రాష్ట్ర నిధుల నుంచి మీరు ఇచ్చేది రూ.14 వేలు మాత్రమే. ఆనాడు ప్రతిపక్షంలో పెద్ద పెద్ద మాటలు చెప్పారు. కేంద్ర పథకంతో రాష్ట్రానికి ఏం సంబంధం అని మాటల తూటాలు పేల్చారు. కేంద్రం నేరుగా రైతుల ఖాతాల్లో వేస్తున్నప్పుడు మీరు ఇచ్చినట్టు ఎలా చెప్పుకుంటారు అని నాడు ప్రశ్నించారు. రెండూ కలిసే ప్రశ్నే లేద న్నారు. ఆనాడు అన్ని మాటలు చెప్పిన మీరు ఇప్పుడు కేంద్రం నిధులతో ఎందుకు లింక్ పెట్టారు? మీరు ఇస్తామని చెప్పిన రూ.20 వేలలో కేంద్రం వాటాను ఎందుకు కలిపారు హామీలు ఇచ్చేముందు కేంద్రం వాటాతో కలిపి అని ఎందుకు చెప్పలేదు కేంద్రం ఇచ్చే పీఎం కిసాన్ పథకం దేశంలో ఉన్న రైతులందరికీ.ఏపీకి మాత్రమే కాదు కదా! దీనికి చంద్రబాబు సమాధానం చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం నేరుగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుకు రూ.20 వేలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నాం" అంటూ షర్మిల స్పష్టం చేశారు.

# బనకచర్ల కట్టి తీరుతామని లోకేశ్ చెబుతున్నారు

శాఖ మంత్రి, కాంగ్రెస్ నాయకులు ఎవరూ మాట్లాడటం లేదని విమర్శించారు.ఏదో లోపాయికారి ఒప్పందం చేసుకున్నందువల్ల వారు మాట్లాడటం లేదని ఆయన ఆరోపించారు. గోదావరి-బనకచర్ల అజెండాలో ఉంటే తాము ఉమ్మడి రాష్ట్రాల సమావేశానికి రాబోమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేంద్రానికి లేఖ రాస్తే, ముఖ్యమంత్రి, అధికారులు మాత్రం ఇటీవల హాజరయ్యారని గుర్తుచేశారు. రాత్రికి రాత్రి ఢిల్లీకి వెళ్లి... మొదటి అంశమే బనకచర్ల ఉన్నప్పటికీ సమావేశంలో పాల్గొని, కమిటీ వేయడానికి అంగీకరించారని ఆరోపించారు.తెలంగాణ కాంగ్రెస్ నేతల ధైర్యం చూసుకొని లోకేశ్ బనకచర్ల కట్టి తీరుతామని చెబుతున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బనకచర్లపై ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్, బీజేపీ మౌనం కారణంగానే చంద్రబాబు బనకచర్లపై బుల్డోజింగ్ విధానంతో వెళుతున్నారని విమర్శించారు. మేం బనకచర్ల కట్టి తీరుతామని లోకేశ్ చెబుతుంటే, అసలు బనకచర్ల కడితే కదా అడ్డుకునేది అని రేవంత్ రెడ్డి చెబుతుండటం విడ్డూరంగా ఉందని అన్నారు.రేవంత్ రెడ్డి గురుదక్షిణ చెల్లించుకునే పనిలో ఉన్నట్లుగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. బనకచర్లపై లోకేశ్ బరితెగించి మాట్లాడుతున్నారని తీవ్రంగా మండిపడ్డారు. తన పదవిని కాపాడుకోవడం కోసం రేవంత్ రెడ్డి గురు దక్షిణ చెల్లించే పనిలో ఉండగా, ఢిల్లీలో పీఠాన్ని కాపాడుకోవడం కోసం బీజేపీ మౌనంగా ఉంటోందని ధ్వజమెత్తారు.



తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 02 - 08 - 2025

# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు లో ఈషా ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం



**తెలంగాణ సేన** : గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సిద్దిపేట నుండి హైదరాబాద్ వెళ్లే రోడ్డు లో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రింగ్ రోడ్డు పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఈషా ఫ్యామిలీ రెస్టారెంట్ శుక్రవారం నాడు ఘనంగా ప్రారంభత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఈషా ఫ్యామిలీ రెస్టారెంట్ యాజమాన్యం వేణుగోపాల్, నాగరాజు, వేణుగోపాల్, నీరజ్, ఎస్.మహేష్ మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మా రెస్టారెంట్ ప్రారంభం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మా రెస్టారెంట్ లో అనుభవం కలిగిన వంట మాస్టర్ల చేత రుచికరమైన శాఖ హారం ఉందని తెలిపారు.

# వాణి విద్యాలయం హై స్కూల్ లో ఘనంగా గ్రీన్ డే వేడుకలు....



**వేములవాడ,ఆగష్టు 01 (తెలంగాణ సేన)** : వేములవాడ పట్టణంలోని వాణి విద్యాలయం ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం గ్రీన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ప్రీ ప్రైమరీ విద్యార్థులు ఆకుపచ్చ రంగుతో కూడిన దుస్తులు ధరించి,అదే రంగులో ఉన్న వస్తువులతో పాఠశాలకు హాజరయ్యారు. కరస్పాండెంట్ బద్దం అనంతరెడ్డి, పిల్లి మహేష్ మాట్లాడుతూ ప్రకృతిలో ఆకుపచ్చ రంగు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకుందని తెలిపారు. అలాగే విద్యార్థులకు రంగుల పట్ల అవగాహన కల్పించారు. ఆకుపచ్చ రంగు విశిష్టతను తెలిపారు. ఆకుపచ్చ. రంగులో ఉన్న కూరగాయలు, పండ్లు గురించి వివరించారు. అనంతరం విద్యార్థుల చేత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని మరింత పెంచి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 13న చలో హైదరాబాద్ మహాసభను విజయవంతం చేయండి

– ఎమ్.ఎస్.పి రాజన్న సిరిసిల్ల అధ్యక్షులు కానాపురం లక్ష్మణ్ మాదిగ



రాజన్న సిరిసిల్ల,ఆగష్టు 01 (తెలంగాణ సేన) :: ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాలతో వికలాంగుల, వృద్ధాప్య, వితంతుబోదకాలు, ఒంటరి మహిళ, గీత కార్మికులు మరియు చేనేత కార్మికులు అన్ని రకముల పెన్షన్ పెంపునకు మరియు కొత్త పెన్షన్ ఇవ్వడానికి ప్రభుత్వంపై డిమాండ్ చేస్తూ ముఖ్యమంత్రి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని గ్రామాలలో మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆగస్టు 13న చలో హైదరాబాద్ మహాసభను విజయవంతం చేయడం కొరకు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల కో కన్వీనర్ మారేపు అంజమ్మ, ఎం.ఎస్.పి జిల్లా అధ్యక్షులు కానాపురం లక్ష్మణ్ మాదిగ, వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ నడమల శోభారాణి, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు అందే సామ్యూల్ మాదిగ, నిర్మల, దేవచారి, శకుంతల, జ్యోతి, పుష్పలత, లక్ష్మి, స్రవంతి, అశ్రవా, సువర్ణ, వెంకటరవ, బాపురావు, తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పై అవగాహన

– ఎస్ఐ దిలీప్





**రాజన్న సిరిసిల్ల,ఆగష్టు 01 (తెలంగాణ సేన) :** సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ పరిసర ప్రాంతంలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డుపై వాహనాలను నిర్దేశిత స్థలాలకు వెలుపల నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ప్రాణాలకు ప్రమాదం కలిగే విధంగా వాహనాలను నిలిపే డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించి ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రూల్స్ పాటించాలంటే మొదట అవగాహన అవసరమని, అందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమంలో పలు సూచనలు, నిబంధనలపై వివరంగా చర్చించగా, ఆటో డ్రైవర్లు విశేషంగా స్పందించారు.

# రాజన్న ఆలయంలోని పలు విభాగాలను పర్యవేక్షించిన ఆలయ ఈఓ




**వేములవాడ,ఆగష్టు 01 (తెలంగాణ సేన)** : శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం లోని ముఖ్యమైన విభాగాలైన ప్రసాదముల తయారీ విభాగము, ప్రసాద విక్రయ విభాగము, ప్రోటోకాల్ విభాగములను ఆలయ కార్యనిర్వహణాధికారి రాధా బాయి శుక్రవారం పర్యవేక్షించారు.ప్రసాదములకు వినియోగిస్తున్న సరుకుల నాణ్యత, భక్తుల సమాచార కేంద్ర విభాగంలోని రిజిస్టర్ల నిర్వహణ,ప్రసాద విక్రయ విభాగంలో టికెటింగ్ సిస్టం మొదలగునవి సక్రమంగా నిర్వహణ జరగాలని ఉద్యోగులను సూచించారు.భక్తుల సమాచార కేంద్ర విభాగానికి విచ్చేయు భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని, ప్రసాదం నాణ్యత లో ఎటువంటి సమస్య లేకుండా చూసుకోవాలని, ఉద్యోగులు అందరూ సమయ పాలన పాటించాలని సూచించారు.

# సిరిసిల్ల చేనేత మహిళకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు...

– రాష్ట్రంలోనే అవార్డుకు ఎంపికైన తొలి చేనేత కార్మికురాలు

– రాజన్న సిరిపట్టు పీతాంబరానికి దక్కిన గౌరవం

– 45 రోజుల పాటు శ్రమించి చేనేత అద్భుతాన్ని సృష్టించిన రేఖ





**రాజన్న సిరిసిల్ల,ఆగష్టు 01 (తెలంగాణ సేన ప్రతినిధి – అనీష్ )** : రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన చేనేత మహిళ కళాకారురాలు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికయ్యారు. చేనేత రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైనదిగా భావించే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వెల్ది రేఖను ఎంపిక చేశారు. ఈ అవార్డుకు ఎంపికైన తొలి మహిళా చేనేత కార్మికురాలు వెల్ది రేఖ నే కావడం విశేషం. చేనేత రంగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింప జేసిన ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ సతీమణి రేఖ చేనేత మగ్గంపై సృష్టించిన రాజన్న సిరిపట్టు పట్టు పీతాంబరానికి ఈ అరుదైన గౌరవం దక్కింది. 45 రోజులపాటు శ్రమించి చేనేత మగ్గంపై రూపొందించిన పట్టుచీరను అధికారులు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపిక చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఖ్యాతిని తెలియజేప్పేలా చేనేత దంపతులు హరిప్రసాద్, రేఖ లు ఈ పట్టు పీతాంబరాన్ని నేశారు. 48 ఇంచుల వెడల్పు ,అయిదు మీటర్ల పొడవుతో కూడిన ఈ పట్టు చీరలో కాకతీయుల శౌర్యానికి గుర్తు అయిన కమాన్ తో పాటు వేములవాడ రాజన్న కోడె మొక్కులను సూచించే జరీబుటాలను పొందుపరిచారు. సిరిసిల్ల చేనేత పనితనానికి గుర్తుగా నూలు పడుతున్న మహిళ బొమ్మతో కూడిన జరీబుటాను పట్టుచీరపై నేసి అబ్బురపరిచారు. సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారులైన వెల్ది హరిప్రసాద్, రేఖ దంపతులు గత దశాబ్ద కాలంగా చేనేత రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. నేత పరిశ్రమకు కేంద్రమైన సిరిసిల్ల ఖ్యాతిని ఇనుమడించేలా రాజన్న సిరిపట్టు చీరను రూపొందించారు. అంతేకాక చేనేత రంగంలో కనీ వినీ ఎరగని రీతిలో అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీర, దబ్బనంలో దూరే పట్టుచీరతో పాటు జి 20 లోగోను మగ్గంపైనేసి సాక్షాత్ దేశ ప్రధాని నరేంద్ర మోడీ ప్రశంసలు సైతం అందుకున్నారు. ఇటీవల హైదరాబాద్ కేంద్రంగా జరిగిన మిస్ వరల్డ్ పోటీలలో సైతం చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ తన ప్రతిభను ప్రదర్శించారు. హరిప్రసాద్ నేసిన చేనేత కళారూపాలను చూసి దేశ విదేశాలకు చెందిన సుందరీమణులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పోటీల సందర్భంగా జరిగిన ప్రదర్శనలో సైతం హరిప్రసాద్ వేసిన పలు పట్టుచీరలను వస్త్రాలుగా కుట్టి మిస్ వరల్డ్ పోటీ దారులు రాంప్ వాక్ చేశారు. అనుక్షణం చేనేత రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న హరి ప్రసాద్ దంపతులను కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు కు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.

# నేరాల విచారణలో శాస్త్రీయ ఆధారాలు కీలకం...

ఆధునిక ఫోరెన్సిక్ పద్ధుతులు వినియోగించడం ద్వారా నేరాలను సమర్ధవంతంగా పరిష్కరించవచ్చు..

– జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్






రాజన్న సిరిసిల్ల,ఆగష్టు 01 (తెలంగాణ సేన) :నేరాల విచారణలో శాస్త్రీయ ఆధారాలు,ఆధునిక ఫోరెన్సిక్ పద్ధతుల వినియోగం కీలకమని జిల్లా ఎస్పీ తెలిపారు.నేర సంఘటన స్థలంలో ఆధారాల సేకరణ,భద్రత లో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా కేసుల దర్యాప్తులో కచ్చితమైన ఫలితాలు సాధించవచ్చన్నారు.నేర పరిశోధనలో ఆధునిక సాంకేతికత ఉపయోగం పెరుగుతున్న నేపథ్యంలో,కేసుల విచారణలో ఆధారాలను సైన్స్ పరంగా విశ్లేషించడానికి ఫోరెన్సిక్ శిక్షణ ఎంతో అవసరమని అందులో భాగంగా ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో మెడికల్ కళశాల వైద్య నిపుణుల ఆధ్వర్యంలో జిల్లాలోని ఇన్వెస్టిగేషన్ అధికారులకు,స్టేషన్ రైటర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఐపీఎస్ మాట్లాడుతూ ఆధునిక శాస్త్రీయ విధానాల ద్వారా నేరాలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు పోలీస్ శాఖ మరింత ప్రావీణ్యంతో ముందుకు సాగుతోందని,నేర పరిశోధనలో ఆధునిక సాంకేతికత ఉపయోగం పెరుగుతున్న నేపథ్యంలో,కేసుల విచారణలో ఆధారాలను సైన్స్ పరంగా విశ్లేషించడానికి ఫోరెన్సిక్ శిక్షణ ఎంతో అవసరమన్నారు.ఇలాంటి శిక్షణల ద్వారా కేసుల విచారణలో మరింత నిష్ణాతులుగా తయారయ్యేలా పోలీస్ అధికారులకు,సిబ్బందికి దోహదపడతా యన్నారు.హత్యలు, ఆత్మహత్యలు, దొంగతనాలు మొదలగు నేర సంఘటనలో ఆధారాలు ఏ విధంగా సేకరించాలి, ఏ ఏ ఆధారాలు సేకరించాలి,ఏ విధంగా భద్రపరచాలి,ఫోరెన్సిక్ ల్యాబరేటరికి ఎం ఎం పంపించాలనె అంశాలపై ఇన్వెస్టిగేషన్ అధికారులకు,స్టేషన్ రైటర్లకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఫోరెన్సిక్ సైన్స్ పై అవగాహన కల్పించిన మెడికల్ కళశాల వైద్య బృందాన్ని అభినందించి మెమొంటోస్ జిల్లా ఎస్పీ అందించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజేశ్వరి, వైస్ ప్రెసిపల్ డా. లక్ష్మీ నారాయణ,డా. నిర్విష హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ఫోరెన్సిక్ మెడిసిన్, డా. వినేయ్ మరియు కళాశాల ప్రొఫెసర్లు,డాక్టర్లు,సి.ఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, ఆర్.ఐ లు యాదగిరి, మధుకర్, ఎస్.ఐ లు అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్లు పాల్గొన్నారు.

# హత్యాయత్నం కేసులో నిందుతులకు జైలు శిక్ష,జరిమాన....



**వేములవాడ,ఆగష్టు 01 (తెలంగాణ సేన) :** హత్యాయత్నం కేసులో నిందుతులకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమాన విధిస్తూ అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి అజయ్ కుమార్ జాధవ్ శుక్రవారం రోజున తీర్పు వెల్లడించినట్లు వేములవాడ పట్టణ సీ.ఐ వీరప్రసాద్ తెలిపారు.ఈ సందర్భంగా సీ.ఐ మాట్లాడుతూ బోయినపల్లికి చెందిన ఫిర్యాది అలువాల లచ్చవ్వ భర్త ముత్తయ్య కుల%శీ% యాదవ అనునామే తేదీ 17-2-2023 రోజున వేములవాడ పోలీస్ స్టేషన్ లో చేసిన పిర్యాదు ఏమనగా ఫిర్యాది కొడుకు శ్రీనివాస్ కి 15 సంవత్సరాల క్రితం వివాహం జరుగగా ఇద్దరు పిల్లలు సంతానం కలుగగా ఫిర్యాది కోడలు కొద్ది రోజుల క్రితం పురుగుల మందు త్రాగి చనిపోవడంతో ఆమె మరణానికి ఆమె భర్త,కుటుంబ సభ్యులే కారణమని భావించిన ఆమె తండ్రి అయిన భూపతి మల్లయ్య అన్న విజయ్,గ్రామం ఆర్ అండ్ ఆర్ కాలనీ చింతలటానా తేదీ 17- 2-2023 రోజున బాధితుడు శ్రీనివాస్,అతని స్నేహితుడు మోహన్ లు చింతలటానా గ్రామ శివారులోని తన ప్లాట్ వద్దకు వచ్చేసరికి నిందితులు ఇద్దరు కలిసి శ్రీనివాస్ ని కర్ర,ఇనుప రాడుతో కొట్టగా తీవ్ర గాయాలు కాగా చికిత్స కొరకు ఆసుపత్రికి తరలించినారని తెలుపగా అప్పటి ఎస్సై ఎం.డి రఫీక్ ఖాన్ కేసు నమోదు చేయగా దర్యాప్తు అధికారి అయిన సీ.ఐ ఓ. వెంకటేష్ దర్యాప్తు అనంతరం కోర్టు లో ఛార్జ్ షీట్ దాఖలు చేయగా సీఎంఎస్ ఎస్.ఐ రవీంద్రనాయుడు, కానిస్టేబుల్ మధుసుదన్,కోర్టు కానిస్టేబుల్ సురేష్ లు కోర్టు లో సాక్ష్యులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజిరెడ్డి వాధించగా కేసు పూర్వపలాలను పరిశీలించి అసిస్టెంట్ సెషన్ కోర్టు న్యాయమూర్తి అజయ్ కుమార్ జాధవ్ నిందుతులకు ఐదు సంవత్సరాల జైలు శిక్ష,వెయ్యి రూపాయల జరిమాన విధించినట్లు వేములవాడ టౌన్ సీ.ఐ వీర ప్రసాద్ తెలిపారు.పైకేసులో నిందుతులకు శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి విచారణ అధికారులు ఎస్సై ఎం.డి రఫీక్ ఖాన్,సీ.ఐ ఓ.వెంకటేష్,ప్రస్తుత సీ.ఐ వీర ప్రసాద్,పబ్లిక్ ప్రాసిక్యూటర్ గౌరు రాజీ రెడ్డి,సీఎంఎస్ ఎస్.ఐ రవీంద్రనాయుడు, సీఎంఎస్ కానిస్టేబుల్ మధుసుదన్,కోర్ట్ కానిస్టేబుల్ సురేష్ లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రియాంక కక్కర్‌ను ఘనంగా సన్మానించిభ ఆమ్ ఆద్మి పార్టీ నాయకులు



**తెలంగాణ సేన న్యూస్ హైదరాబాద్ :**ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ చీఫ్ స్పోక్స్ పర్సన్, అడ్వకేట్,తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ .ప్రియాంక కక్కర్ శుక్రవారం తెలంగాణ రాష్ట్రానికి తొలిసారి వచ్చిన సందర్భంగా తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు,నాయకులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో మాట్లాడారు.దేశంలో బిజెపి ప్రభుత్వం అనేక రంగాల్లో విఫలం అయింది.అమెరికా భారతదేశాన్నీ ఎంత అవమానం చేసిన మోదీ స్పందించడం లేదు. ఒక్క పాకిస్తాన్ వారికి మాత్రమే అతను అనుకూలంగా పనిచేస్తుంది. తెలంగాణలో ఆర్ఎస్ఎస్,టిడిపి ఐడియాలజీ ప్రకారం పరిపాలన కొనసాగుతుంది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రభుత్వం మర్చిపోయింది. తెలంగాణలో విద్యకు 7 శాతం. వైద్యానికి 4 శాతం బడ్జెట్ కేటాయించడం అంటే తెలంగాణను వెనకకు నెట్టి వేయడమే.తెలంగాణ విద్యలో 25వ స్థానంలో ఉంది అంటే ఇక్కడి ప్రభుత్వం ఎంత బాగా పనిచేస్తుందో అని అర్థమవుతుంది. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడంలో ఉన్న శ్రద్ధ. విద్య, వైద్యం పై ఉంచాలని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేస్తుంది.బిజెపి ప్రభుత్వం ప్రజలను మోసం చేసి గెలుస్తుంది. ఢిల్లీలో ఏ విధంగా అయితే ఓటర్లను తొలగించారు. అదేవిధంగా త్వరలో జరగబోయే బీహార్లో కూడా స్థానికులైన ఓటర్లను తొలగించి గెలవాలని చూస్తుంది. విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ.మేము ఇండియా కూటమి లో లేము అనివివరించారు. అనంతరం భారీ కాన్వాయ్ తో బయలుదేరి లిబర్టీ సర్కిల్ వద్ద ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళి అర్పించిన తర్వాత అక్కడి నుండి పాదయాత్రగా ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు.ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో, పార్టీ నాయకులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలోమాట్లాడుతూ.తెలంగాణ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ ఐడియాలజీ ప్రకారం నడుస్తుంది అని వివరించారు.విద్యకు ఏడు శాతం వైద్యానికి నాలుగు శాతం బడ్జెట్ కేటాయించడం అంటే తెలంగాణ ప్రజలను మోసం చేయడమని అని విమర్శించారు. ఆగస్టు 2 శనివారం మధ్యాహ్నం 12 గంటలకు బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం ఉంటుందని, అందులో పూర్తి వివరాలు వివరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆమ్ ఆద్మీ పార్టీ ఇంచార్జ్ కన్వీనర్ డిడ్ డి సుధాకర్, ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ అధ్యక్షులు బుర్ర రాము గౌడ్, పార్టీ యువజన విభాగం మాజీ అధ్యక్షులు విజయ్ మల్లంగి , వికలాంగుల కమిటీ మాజీ అధ్యక్షులు దర్శనం రమేష్ , ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ ట్రెజరర్ అన్సారి, ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు హేమ జిల్లా,నార్సింగి యమున, డాక్టర్స్ వింగ్ నాయకురాలు లక్ష,మాజీ అధికార ప్రతినిధి జావేద్ షరీఫ్,యువజన విభాగం మాజీ ఉపాధ్యక్షుడు బాబూలాల్ పవర్, కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇన్చార్జి శివాజీ , మాజీ జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఇంచార్జ్ సలావుద్దీన్, ఖైరతాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ మహమ్మద్ మజీద్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యం

అర్హులైన వారందరికీ ప్రభుత్వం పథకాలు

శాలిగౌరారం లో రేషన్ కార్డ్ ల పంపిణీ కార్యక్రమం

పాల్గొన్న ఎమ్మెల్యే సామేలు



**శాలిగౌరారం,తెలంగాణ సేన:** కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంతో పాటు,పేద ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు.శుక్రవారం మండలంలోని రామంజపురం,తక్కెళ్ళపహాడ్, జాలోని గూడెం,అంబారి పేట గ్రామాలలో ఇటీవలే పూర్తిచేసిన సిసి రోడ్లన్నీ ప్రారంభించారు. మండల కేంద్రంలో 80 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రాథమిక సహకార సంఘం భవనం,గోడౌన్ ను ప్రారంభించారు.అనంతరం శాలిగౌరారం మండల కేంద్రంలోని సీఎంఆర్ ఫంక్షన్ హాల్ లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తుంగతుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన తక్కువ కాలం లోనే నియోజకవర్గం వ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు.రైతన్న లకు రుణమాఫీ,రైతు భరోసా,అర్హులైన పేద కుటుంబాలకు రేషన్ కార్డులను మంజూరు చేశామన్నారు. అనంతరం అంబారిపేట 20 లక్షల రూపాయలతో నిర్మించబోయే నూతన గ్రామ పంచాయతీ శిలా పలకాన్ని ప్రారంభించారు. అనంతరం వెనుకబడిన మా ప్రాంతానికి గతంలో బస్సు సౌకర్యం ఉండేదని,ఇప్పుడు బస్సు రాకపోవడంతో సామాన్య ప్రజలమైన మేము, మా ఊరి విద్యార్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా మని ఎమ్మెల్యేకు తెలియజేయడంతో స్పందించిన ఎమ్మెల్యే సామేలు నల్గొండ డిపో మేనేజర్ తో మాట్లాడి నకిరేకల్ నుంచి అంబారీపేటకు బస్సు వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్ డి వో యానాల అశోక్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి, శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి,తహసిల్దార్ జమీరుద్దీన్, ఎంపీడీవో జ్యోతిలక్ష్మి,ఫ్యాక్స్ చైర్మన్ తాళ్లూరి మురళి,మార్కెట్. వైస్ చైర్మన్ నరిగే నర్సింహా,మండల అధ్యక్షులు సమరం రెడ్డి,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండపల్లి కొమరయ్య, తుంగతుర్తి నియోజకవర్గం యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్ ,ఎస్సి సెల్ మండల అధ్యక్షులు బోడ అరుణ్ కుమార్ , మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లికొండ గణేష్ కాంగ్రెస్ నాయకులు గోదల నరేందర్ రెడ్డి, ఇంతియాజ్ అమ్మద్, నోముల జనార్ధన్, చింత ధనుంజయ,గూని వెంకటయ్య, కట్టంగూరి సురేందర్ రెడ్డి ,భూపతి వెంకన్న, వడ్లకొండ పరమేష్, సంకటి తోటకూరి పరుశరాములు ,ఓగోటి శంకర్,నూక కిషోర్,జమ్ము అశోక్,కదారి అంజయ్య,మొగుళ్ల శీను,లోడే సత్తయ్య,డి.టీ వరప్రసాద్,ఆర్ ఐ లు అజారుద్దీన్,రఫీ,పాక్స్ డైరెక్టర్ లు,మార్కెట్. కమిటి డైరెక్టర్ లు తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
శనివారం 02 - 08 - 2025

## మాజీ ఎంపిటిసి సేవలు కొనియాడదగినవి



**ముధోల్:ఆగష్టు 01:తెలంగాణ సేన న్యూస్. :** ముధోల్:ముధోల్ మాజీ ఎంపిటిసి అయిన దేవోజీ భూమేష్ సేవలు కొనియాడదగినవని కాలనీవాసులు అంటున్నారు. తానూర్ బైపాస్ రోడ్డు మార్గాన పోస్టాఫీసు వెనకాల గల 7 వ వార్డు కాలనీలో గత కొన్ని రోజులుగా రోడ్డుపై నీరు నిలిచి బురదమయంగా మారింది.దీంతో రోడ్డున నడిచే స్థానిక వాసులకు తీవ్ర ఇబ్బందిగా మారింది.కాలనీవాసుల ఇబ్బందులను గమనించిన ఆయన వెంటనే స్పందించి తన స్వంత నిధులతో రోడ్డుపై మొరం వేయించి మార్గం సుగమం చేశారు.దీనికి గాను కాలనీవాసులు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కాలం చెల్లిన మందులు ఎరువులు వాడొద్దు

### తహసీల్దార్ శ్రీలత.



**ముధోల్:ఆగష్టు 01:తెలంగాణ సేన న్యూస్. :** ముధోల్:కాలం చెల్లిన మందులు,ఎరువులు వాడొద్దని తహసీల్దార్ శ్రీలత హెచ్చరించారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలోని గ్రోమోర్ మందులు,ఎరువుల కేంద్రాన్ని తనిఖీ చేశారు.మందులు,ఎరువుల స్టాక్ ను పరిశీలించి పలు సలహాలు,సూచనలు చేశారు.కొనుగోలు దారులకు తప్పనిసరిగా సంబంధిత రసీదు ఇవ్వాలన్నారు.స్థానిక మేనేజర్ యోగేష్ తో గ్రోమోర్ కేంద్రానికి సంబంధించిన పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రచన, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మాతకు ప్రత్యేక పూజలు

### ఘనంగా లక్ష పుష్పార్చన, సామూహిక వాసవి పారాయణం



**తెలంగాణ సేన న్యూస్.** : సిద్దిపేట జిల్లా గజ్వేల్ రామాలయంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శుక్రవారం శ్రావణమాసం పూజలు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పంచామృత అభిషేకములు, గోపూజ, మహిళా మణులతో కుంకుమార్చన , లక్ష పుష్పార్చన మరియు వాసవి అమ్మవారి పారాయణం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాద అందజేశారు, ఈ కార్యక్రమంలో పురోహితులు శంకర్ పంతులు,తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, సిద్ధి బిక్షపతి,నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర నాయకులు గంప శ్రీనివాస్, ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్షుడు అత్తెల్లి శ్రీనివాస్,నంగునూరి సత్యనారాయణ, మల్యాల భద్రయ్య, గోలి సంతోష్,గంగిశెట్టి వెంకటేశం, ఇటిక్యాల తాజా మాజీ సర్పంచ్ రావికంటి చంద్రశేఖర్, సూర ఆంజనేయులు,సిద్ధి నవీన్, తొడుపునూరి కాశీనాథ్, బచ్చు రవి, కైలాస ప్రశాంత్, రామారావు, రమేష్ ,సిరిపురం సత్యనారాయణ, కొమరవెల్లి శంకరయ్య,ఉప్పల కృష్ణమూర్తి, జగ్గయ్యగారి శ్రీనివాస్, తెరలా రాజు, ఉప్పల శ్రీను, మల్యాల వెంకటేశం, గండె యాదగిరి, నేతి శీను, మల్యాల వెంకటేశం కాపర్తి వైకుంఠం, గంగిశెట్టి నాగమణి జగ్గయ్యగారి లత, తోడుపునూరి శారద, సిద్ది నాగశ్రీ, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు

## చల్లా కు... చల్లని వార్త చెప్పిన మంత్రి సీతక్క



**కొత్తగూడ తెలంగాణ సేన** :రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖలో డైరెక్టర్ గా చల్లా నారాయణరెడ్డి అందరికీ సర్ప్రైజ్ ఇచ్చిన మంత్రి సీతక్క మహబుబాబాద్ జిల్లా రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ గా చల్లా నారా యణ రెడ్డి నియమిస్తూనట్లు ప్రకటించారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క కొత్తగూడ మండలం సాధిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన చల్లా నారాయణ రెడ్డి మొదటి నుండి పార్టీ కి పలు రకాలు గా సేవలు అందించారు. ఆయన సేవలను గుర్తించి పంచాయతీ రాజ్ డైరెక్టర్ గా నియమించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క లకు నారాయణ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## లక్నవరంలో పంట కాలువలకు నీటిని విడుదల చేసిన మంత్రి సీతక్క

ములుగు తెలంగాణ సేన

- లక్నవరం చెరువు కింద ఉన్న ప్రతి ఒక్క ఎకరాకు సాగునీరు అందిస్తాం
- త్వరలో రామప్ప చెరువు నుండి కెనాయిల్ ద్వారా లక్నవరం చెరువును పూర్తిగా నింపుతాం



**తెలంగాణ సేన** :గోవిందరావుపేట లక్నవరం వద్ద పంట కాలువలకు రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క నేడు శుక్రవారం రోజున నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గత కొంతకాలంగా రైతులకు నాట్లు వేసుకోవడానికి నీటి కొరత ఉందని తెలుసుకొని, ఇటీవల లక్నవరం సరస్సు తూముల మరమ్మతు పనుల అనంతరం నీటిని విడుదల చేశామన్నారు. ప్రస్తుతం లక్నవరం సరస్సు 28 ఫీట్ల నీటి మట్టం కలిగి ఉందని, మొత్తం 33 ఫీట్లు సామర్థ్యాన్ని సరస్సు కలిగి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి తో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జిల్లా బ్లాక్ మండల గ్రామ నాయకులు రైతుకు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## ఆగస్టు 1 నుండి 9వరకు జిల్లాలో గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు,ప్రదర్శనలు జరుపండి



**మహబుబాబాద్ జిల్లా తెలంగాణ సేన ఆగష్టు-1** : ఆగస్టు9ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లాలో గ్రామ గ్రామాన సభలు సమావేశాలు ప్రదర్శనలు జరపాలని కోరుతూ శుక్రవారం రోజున జిల్లా కేంద్రంలో గల న్యూ డెమోక్రసీ ఆఫీసు లో ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి బండపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది.ఈకార్యక్రమంలో ) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సనప పామ్మయ్య పాల్గొని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఆగస్టు 9న ఆదివాసీ దినోత్సవం జరుపాలని ఐక్యరాజ్య సమితి, పిలుపునిచ్చింది,పేరుకి,మాత్రం,ఆదివాసీ,దినోత్సవం జరుపాలని, ఆదివాసీలకు అన్నిరకాలుగా అండగా ఉంటున్నామని ప్రగల్భాలు పలుకుతున్న పాలకులు ఆదివాసీల హాక్కులకు భంగం కలిగించే విధంగా ప్రభుత్వాలు,వ్యవహరిస్తున్నాయని అన్నారు.ఈదేశానికి మూలవాసులైన ఆదివాసీల సాంప్రదాయాలు, సంస్కృతులు వేరుగా ఉంటాయి.వేల సంవత్సరాలుగా అడవులలో భయంకరమైన క్రూర మృగాల మధ్యన జీవనం సాగిస్తు కొండలలో,కోణలలో పోడు వ్యవసాయం చేసుకుంటూ అడవి బిడ్డలుగా జీవిస్తున్న ఆదివాసీలను అడవులనుండి వెళ్లగొట్టే కుట్రలు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయి. ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతంలో 46రకాలకు పైగా ఖనిజ సంపదలు ఉన్నాయి,ఈ ఖనిజ సంపదను,బడావ్యాపారాస్తులకు,కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడం,కోసం,అడవులనుండి వెళ్ళగొట్టే కుట్రలు చేస్తుంది,అందులో భాగంగానే ఆదివాసీలకు అండగా ఉన్న విప్లవకారుల ను నక్సలైట్ల పేరుతో భూటకపు ఎన్ కౌంటర్ లో పాలక వర్గాలు కాల్చి చంపుతున్నారని అన్నారు.అందుకే ఆదివాసీలపై జరుగుతున్న దాడులను,ఖండిస్తూ,ఆదివాసీల హక్కుల రక్షణకై ఆదివాసీల ఐఖ్యంగా ఉద్యమించాలని,అందులో భాగంగానే,ఆగస్టు1నుండి9వరకు జిల్లాలో గ్రామ గ్రామాన సభలు,సమావేశాలు,ప్రదర్శనలు జరపాలని ఆయన పిలుపునిచ్చారు,ఇంకా ఈకార్యక్రమంలో భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు . మదార్ జిల్లా నాయకులు కన్మంతరెడ్డి భాస్కర్ రెడ్డి.సట్ల యాకయ్య. %ూ×ఖమీ% నాయకులు బాలు,వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## డా.అన్నబహు సాటే 105 వ జయంతి వేడుకలు



**బైంసా:ఆగష్టు 01:తెలంగాణ సేన న్యూస్ : బైంసా :** లోక్షాహిర్. సాహిత్య రత్న. అన్నాబహు సాటే జయంతి వేడుకలు జరుపుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో భాగంగా అధ్యక్షుడు ఉత్తంభాలే రావు గారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం పేద మధ్యతరగతి కార్మిక కర్షకుల కోసం తన గళాన్ని విప్పుతూ నవలలు.కదంబరలు. పాటలు. రచనల ద్వారా ఈ సమాజంలో చైతన్యం తీసుకు వచ్చినటువంటి గొప్ప ప్రజానాయకుడు అన్నబహు సాటే గారు. రష్యా దేశంలో తన విగ్రహం పెట్టే స్థాయిలో ఎదిగినటువంటి భారతదేశ ఏకైక నాయకుడు అన్నబహు సాటే.ముంబై ని రాజధానిగా మహారాష్ట్రకు ఉండే విధంగా కృషి చేసినటువంటి ప్రజానాయకుడు. శివాజీ మహారాజ్ జీవిత చరిత్రను ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన కళాకారుడు. 20వేల మందితో ముంబై పట్టణంలో స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న యోధుడు. కార్మికుల కోసం రోజుకు8 గంటల పని దినము తగు కూలి గురించి పోరాడినటువంటి వ్యక్తి. ఈ విధంగా అన్నబహు సాటే పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపడానికి 1/08/1920. మహారాష్ట్రలోని. సాంగ్లీ జిల్లా. వాళ్వ. తాలూకాలోని వాటేగావ్ గ్రామంలో జన్మించడం జరిగింది. అందుకుగాను భారతదేశంలో ఉన్నటువంటి ప్రతి గ్రామ గ్రామన పల్లెపలేనా గడప గడపలో అన్న బహుసాటే గారి యొక్క జయంతి వేడుకలను ఈరోజు నుండి ఆగస్టు 31వ తేదీ వరకు జయంతి ఉత్సవాలను జరుపుకోవడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా. రాష్ట్ర ఉపాధ్యక్షుడు. చంద్రబాన్ గణపతి. స్థాచు ఉపాధ్యక్షుడు నామత్కర్ దిగంబర్. ప్రధాన కార్యదర్శి. గాయక్వాడ గంగాధర్. గోరేఖ శంకర్. చిలింకర్ గంగాధర్. అమృత్. నందు.సాయి చంద్. అడ్వకేట్ సుజిత్. బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు తలోడ్ శ్రీనివాస్. బీసీ సంఘం జిల్లా నాయకులు సుంకేట పోశెట్టి. గైక్వాడ్ సాయినాథ్ యువ నాయకుడు. గైక్వాడ్ లాలు. పూజారి లక్ష్మణ్. సౌనా గణపతి. చిలిమ్కర్ దిగంబర్. షెల్కె ఆనంద్. గాడేకర్ బాబు. అంబేద్కర్ సంజు. గాడెకర్ రాజు తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఆగస్టు 09 ప్రపంచ ఆదివాసీ దినోత్సవన్ని విజయవంతం చేద్దాం



**కొత్తగూడ తెలంగాణ సేన:** ప్రపంచ దేశాలన్నీ నడుం కట్టి ఆదివాసి సంరక్షణకు కృషి చేయాలని ఆదివాసిలకు స్వయం నిర్ణాధికార హక్కు ఉండాలని స్వేచ్ఛగా జీవించాలని సంస్కృతి సంప్రదాయాలు హక్కులు చట్టాలు భాషలు కాపాడుకోవాలని గిరిజనేతరులు ఏజెన్సీలో అక్రమంగా అతిక్రమించిన భూములను తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు ఆదివాసి అభివృద్ధి కోసం తను నివసించే ప్రాంతంలో ఉండే ప్రకృతి వనరులైన అడవులు నదులు ఖనిజాలు అటవి ఫలశియాన్ని వినియోగించుకునే హక్కులను రక్షించుకొనుటకు అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 9న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించబడుతుంది.ఆదివాసి హక్కుల పరిరక్షణ కోసం ఈ దినోత్సవం నిర్వహించాలని 1994 లో ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. ఈ సందర్భంగా సమావేశమైన ఆదివాసి నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి కొత్తగూడ మండలంలో ఉన్నటువంటి ప్రతి ఆదివాసి గ్రామద లో దొర పటేళ్లు, యువత యువకులు,మహిళలు, ఉద్యోగులు, గ్రామస్తులు ప్రజా ప్రతి నిధులు పార్టీలకు అతీతంగా తమ గ్రామంలో ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని ఆదివాసీ జెండా ఎగరవేయాలని ఆదివాసీల హక్కులు, చట్టాలు,సాంస్కృతి సంప్రదాయాల కోసం పోరాడి అమరులైన ఆదివాసీ పోరాట యోధుళ్లను స్మరించుకోవాలని పిలుపు నిచ్చారు. కొత్తగూడ మండల కేంద్రంలో భారీ ఎత్తున కొమ్ము కోయ,గుస్సాడి, దింసా ఆదివాసీ సంప్రదాయ నృత్యలతో ర్యాలీ అనంతరం "కుంభ్రమ భీం" విగ్రహం వద్ద జెండా ఆవిష్కరణ తరువాత సభ నిర్వహించడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం "ప్రపంచ ఆదివాసీ దినోత్సవం" కీ 20 కోట్లు కేటాయించలని డిమాండ్ చేశారు.

ఇంకా నాయకులు మాట్లాడుతూ... 1982 సంవత్సరంలో ఆగస్టు 9న జెనీవాలో అటవీ వనరుల హక్కులకు సంబంధించిన సమస్యలపై 26 మంది స్వతంత్ర మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూపుల సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఆగస్టు 09న ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరపాలని నిర్ణయించింది.ఆదివాసుల కోసం కూడా ఒకరోజు ఉండాలని ఐక్య రాజ్య సమితి ని కమిటీ కోరగా ఆదివాసుల సంరక్షణ చట్టాలకు ఐక్య రాజ్య సమితి ఆమోదం తెలిపింది ఈ కమిటీ 1994 నుండి 2014 వరకు 10 సంవత్సరాల పాటు ప్రపంచవ్యాప్తంగా తిరిగి ఆదివాసీల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి విశ్లేషించి 1994 నుండి 2014 వరకు ఈ మధ్య కాలాన్ని ఆదివాసుల అభివృద్ధి కాలంగా పరిగణించి ఆగస్టు 9న అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం గ ప్రకటించింది.

ఐక్య రాజ్య సమితి అంచనాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 70 దేశాలలో 5 వేల తెగలకు చెందిన 40 కోట్ల ఆదివాసి జనాభా ఉంది. 7వేల భాషలు మాట్లాడతారు. మనదేశంలో 750 ఆదివాసి తెగలు 92 శాతం వరకు అటవీ ప్రాంతాలలో నివసిస్తారు మన రాష్ట్రంలో అటవీ ప్రాంతంలో నివసిస్తున్న తెగలు కోయ,గోండ్, నాయక్ కోడ్,కొలం, పర్ధన్, చెంచు, అంద్, బిల్,తోటి మొదలగు ఆదిమ తెగలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీలు వ్యవసాయం, వేట, అటవీ ఉత్పత్తులు జిగురు,ఇప్పపువ్వు, ఇప్పగింజలు, ముష్టి గింజలు, చిల్లగింజలు,తునికి ఆకు, చింతపండు,తేనే,చిగురు, విస్తారాకులు, కలప మొదలగు అటవీ ఉత్పత్తులను పై ఆధారపడి జీవిస్తున్నారు. అంతర్జాతీయంగా ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలు విద్య,ఉద్యోగం,ఆరోగ్యం,భూమి,సంస్కృతిసంప్రదాయాలపై హక్కుల పరిరక్షణ వంటి అంశాలు ఐక్యరాజ్యసమితి ప్రతినిధుల సభ 1993 సంవత్సరంలో అన్ని దేశాల ఆదివాసిలను రక్షించాలని ఈ కమిటీ విశ్లేషించి 1994 నుంచి 2014 సంవత్సరం వరకు "ఆదివాసి ల అభివృద్ధి కాలంగా"నిర్ణయించింది. ఈ దినోత్సవం రోజున ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆదివాసీలు ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవన్ని జరుపుకొని సభలు సమావేశాలు నిర్వహించి ప్రజల్లో ఆదివాసుల హక్కుల గురించి అవగాహన కలిగిస్తారు.

ఆదివాసులు అండగా నిలిచిన వారిని స్మరిచ్చుకుంటారు. కార్యక్రమం లో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ ఆగబోయిన రవి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ధనసరి రాజేష్, తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు కుంజ నర్సింహా రావు, పూనేం సందీప్ దొర తుడుం దెబ్బ కొత్తగూడ మండల అధ్యక్షులు, ఆదివాసీ ఉద్యోగ సంఘం సిద్ద బోయిన బిక్షం %ూఖీ% జిల్లా అధ్యక్షులు, పెనక ప్రభాకర్ %ూూ% జిల్లా ఉపాధ్యక్షులు, ఆదివాసీ సంఘాల నాయకులు కంగాల నాగేశ్వర్ రావు, అలెం జ%శీ%పయ్య,సిద్ద బోయిన లక్ష్మీ నారాయణ, పుల్స%శీ% మునేష్, ఇర్ప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్ ఆధ్వర్యంలో గుడాల శేఖర్ గుప్త కు సన్మానం



సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షునిగా ఇటీవల నూతనంగా ఎన్నికైన గుడాల చంద్రశేఖర్ గుప్త ను శుక్రవారం గజ్వేల్ లో సన్మానించిన కొమరవెల్లి మండలం రామ్ సాగర్ తాజా మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్టు యూనియన్ గజ్వేల్ నియోజకవర్గం అధ్యక్షులుగా ఎన్నికైన గుడాల చంద్రశేఖర్ గుప్తను శాలువాతో సన్మానించడం జరిగిందన్నారు. జర్నలిస్టులు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ఎన్నో సమస్యలు పరిష్కరించడంలో ముందు వరుసలో ఉన్నవారని, వారు రాసే రాతల వల్ల ఎన్నో సమస్యలు పరిష్కరించబడ్డాయని, ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా పనిచేస్తూ ప్రజా సమస్యలు తీర్చడంలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు తిప్పారం కనకయ్య, గజ్వేల్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఎల్లం రాజు,తదితరులు పాల్గొన్నారు.

## బనకచర్ల జలరాజకీయం.. సమైక్యతకు పెను సవాల్



**నిర్మల్:ఆగష్టు 01:తెలంగాణ సేన న్యూస్. :** నదులు ప్రాణం, సంస్కృతి, జీవనాధారం. కానీ, దురదృష్టవశాత్తు, మన దేశంలో అనేక నదులు రాష్ట్రాల మధ్య నిరంతర వివాదాలకు కారణమవుతున్నాయి. కృష్ణా నదిపై నెలకొన్న బనకచర్ల జలవివాదం ఇందుకు తాజా నిదర్శనం. ఇది కేవలం నీటి పంపకాలకు సంబంధించిన సాంకేతిక సమస్య కాదుబీ లోతైన రాజకీయ కుట్రలు, ప్రాంతీయ ఆకాంక్షలు, భవిష్యత్ భయాలు కలగలిసిన ఒక సంక్లిష్ట పరిస్థితి. తెలంగాణలో వ్యక్తమవుతున్న అభ్యంతరాలు, ఆంధ్రప్రదేశ్‌లో వినిపిస్తున్న వాదనలు - ఈ పరిణామాలు కేవలం నీటి సమస్యగా కాకుండా, రాజకీయ లబ్ధి కోసం ఉద్దేశపూర్వకంగా సృష్టించబడుతున్న సంక్షోభంగా స్పష్టమవుతున్నాయి.

కృష్ణా నది జలాల పంపకాలు దశాబ్దాలుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ, రాష్ట్ర విభజన తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నిరంతర తగాదాలకు కేంద్ర బిందువుగా మారాయి. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులు, ఆ తర్వాత బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ సిఫార్సులు %-% ఇవన్నీ ఏదో ఒక రూపంలో వివాదాలకు తావిచ్చాయి. బనకచర్ల రెగ్యులేటర్ అనేది రాయలసీమకు నీటిని మళ్ళించే ఒక కీలకమైన జలవిభజన పాయింట్. ఉమ్మడి రాష్ట్రంలో ఇరు ప్రాంతాల ప్రజలు ఒకే గొడుగు కింద ఉన్నప్పుడు కూడా ఈ నీటి పంపకాలపై అసంతృప్తి ఉండేది. ఇప్పుడు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత, 'మా మిగులు జలాలను మేము వాడుకుంటామంటే అభ్యంతరం చెబుతున్నారు' అనే తెలంగాణ వాదన, 'మా హక్కును కాలరాస్తున్నారు' అనే ఆంధ్రప్రదేశ్ వాదన తీవ్ర రూపం దాల్చింది. మిగులు జలాలు అనే భావనపై ఇరు రాష్ట్రాల మధ్య స్పష్టత లేకపోవడమే ఈ సమస్యకు మూలం. నదీ బేసిన్‌లో వర్షపాతం, వరదల ఆధారంగా లభించే నీటిని మిగులు జలాలుగా పరిగణించాలి. కానీ, ఈ మిగులు జలాల లభ్యత, వాటిని వాడుకునే హక్కులపై శాస్త్రీయమైన, నిష్పాక్షికమైన అధ్యయనం, దానిపై ఒక ఒప్పందం లేకపోవడం వల్లనే ఈ వాదనలు పుట్టుకొస్తున్నాయి. ప్రతి రాష్ట్రం తమ అవసరాలు, ఆకాంక్షలను ప్రాతిపదికగా చేసుకుని మిగులు జలాలను నిర్వచించుకోవడంతో వివాదం మరింత జటిలమవుతోంది.


కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు జీవనాడి. గోదావరి జలాలను ఒడిసిపట్టి, తెలంగాణలోని బీడు భూములకు సాగునీరు అందించే లక్ష్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టుపై ఇప్పుడు అనుమతుల అంశంపై ప్రశ్నలు తలెత్తడం గందరగోళానికి దారితీస్తోంది. 'కాళేశ్వరం కట్టేముందు అనుమతులున్నాయా?' అని ఆంధ్రప్రదేశ్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. నిజానికి, పెద్ద ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్ర జలసంఘం (%జఔజ%), పర్యావరణ అనుమతులు తప్పనిసరి. కొన్ని ప్రాజెక్టులు విభజన పూర్వం అనుమతులు పొందినా, ఆ తర్వాత డిజైన్ మార్పులు, సామర్థ్య పెంపుదల వంటివి జరిగితే, తిరిగి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో పారదర్శకత లేకపోతే, వివాదాలు తలెత్తడం సహజం. 'దిగువ రాష్ట్రంలో ప్రాజెక్ట్ కడితే, ఎగువ రాష్ట్రానికి అభ్యంతరమేంటి?' అనే తెలంగాణ వాదనపై కూడా చర్చ అవసరం. ఒక నదిపై ఎగువన లేదా దిగువన ఒక రాష్ట్రం ప్రాజెక్టు నిర్మించినప్పుడు, దాని ప్రభావం ఇతర బేసిన్ రాష్ట్రాలపై ఉండకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం (%×ూ=ఔణ ాూఝ్%) దీనిపై స్పష్టమైన మార్గదర్శకాలను అందిస్తుంది. ఒక రాష్ట్రం తమ భూభాగంలో ప్రాజెక్టు నిర్మించుకోవడానికి స్వయంప్రతిపత్తి ఉన్నప్పటికీ, అది నదీ జలాల పంపిణీ ఒప్పందాలకు లోబడి ఉండాలి. దిగువ రాష్ట్రానికి నీటి ప్రవాహాన్ని ప్రభావితం చేయకుండా, వారి వాటాను తగ్గించకుండా ఉండాలి. లేకపోతే, దిగువ రాష్ట్రం తమ హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆందోళన చెందడం సహజం. ఈ ఆందోళనలను గౌరవించి, శాస్త్రీయ పరిష్కారాలను అన్వేషించాలి.

తెలంగాణలో ఈ నీటి వివాదంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతుండగా, ఆంధ్రప్రదేశ్ మంత్రి లోకేష్ దీనిపై రాజకీయం చేయవద్దని పిలుపునిస్తున్నారు. ఇది సిద్ధాంతపరంగా సరైన సూచన అయినప్పటికీ, ఆచరణలో రాజకీయ నాయకులు ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందడానికి ఈ నీటి వివాదాలను ఒక ఆయుధంగా వాడుకుంటున్నారనే విమర్శ బలంగా ఉంది. ఎన్నికల సమయంలో, లేదా ప్రజాదరణ కోల్పోయినప్పుడు ఇలాంటి సున్నితమైన అంశాలను తెరపైకి తెచ్చి, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం సాధారణమైపోయింది. నిజానికి, నీటి సమస్య అనేది ప్రజల జీవనాధారం, వారి భవిష్యత్తుకు సంబంధించినది. దీనిని రాజకీయ క్రీడగా మార్చడం వల్ల దీర్ఘకాలికంగా ఎవరికీ ప్రయోజనం ఉండదు. బనకచర్ల వద్ద నీటి విడుదల, వినియోగంపై పూర్తి పారదర్శకత అవసరం. ఇరు రాష్ట్రాల సాంకేతిక నిపుణులు కలిసి పనిచేస్తూ, నిజమైన నీటి లభ్యత, అవసరాలపై ఒక స్పష్టమైన నివేదికను రూపొందించాలి. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, ముఖ్యంగా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (%ఖ=వీదీ%), ఈ వివాద పరిష్కారంలో క్రియాశీలక పాత్ర పోషించాలి. కేవలం ఆదేశాలు ఇవ్వడం కాకుండా, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ, మధ్యవర్తిత్వం వహించాలి.

నీటి వివాదాలకు పరిష్కారం కేవలం న్యాయస్థానాల్లో లేదా ట్రిబ్యునళ్ళలో మాత్రమే లభించదు. నిజమైన పరిష్కారం రాజకీయ సంకల్పం, పరస్పర సహకారం, మరియు శాస్త్రీయ దృక్పథం ద్వారానే సాధ్యమవుతుంది. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జలవనరుల మంత్రులు, అధికారులు రాజకీయాలకు అతీతంగా కూర్చుని, వాస్తవాలను చర్చించాలి. పరస్పర ఆరోపణలకు బదులుగా, సమస్య మూలాలను గుర్తించి పరిష్కారాలను అన్వేషించాలి. నీటి లభ్యత, వినియోగం, భవిష్యత్ అవసరాలపై నిష్పాక్షికమైన సాంకేతిక నిపుణులతో సమగ్ర అధ్యయనం చేయించాలి. మిగులు జలాల నిర్వచనం, వాటి పంపిణీపై స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి. ప్రాజెక్టుల నిర్మాణ అనుమతులు, నీటి విడుదల గణాంకాలు, వినియోగ వివరాలు - వీటన్నింటినీ ప్రజలకు అందుబాటులో ఉంచాలి. పారదర్శకత లేకపోవడం అపనమ్మకాన్ని పెంచుతుంది. నదుల అనుసంధానం ద్వారా మిగులు జలాలను లోటు ఉన్న ప్రాంతాలకు మళ్ళించడం వంటి దీర్ఘకాలిక పరిష్కారాలపై దృష్టి సారించాలి. కేంద్ర ప్రభుత్వం, సంబంధిత బోర్డులు కేవలం నియంత్రణ సంస్థలుగా కాకుండా, సమస్య పరిష్కారానికి చురుకైన మధ్యవర్తులుగా వ్యవహరించాలి. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పాక్షికంగా వ్యవహరించాలి.

బనకచర్ల వంటి వివాదాలు కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కావు. అవి రెండు రాష్ట్రాల మధ్య సంబంధాలను, ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తాయి. ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వల్ల కలిగే నష్టం అపారమైనది. ప్రజల జీవనానికి ఆధారమైన నీటిని రాజకీయ ఆయుధంగా మార్చుకోవడం మానుకుని, భవిష్యత్ తరాల జల భద్రత కోసం, ఇరు రాష్ట్రాలు కలిసి నడవాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే, ఈ జల చిచ్చు దశాబ్దాల తరబడి రగులుతూనే ఉంటుంది.

**వెంక గారి భూమయ్య**
సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ 9848559863



# దేశాన్ని ఉలిక్కి పడేలా చేసిన ఫిర్యాదు తవ్వకాల్లో బయటపడుతున్న శవాలు







కర్ణాటకలోని ధర్మస్థలలో ఏం బయటపడతాయో అనే దాని గురించే యావత్ దేశం ఆసక్తిగా చూస్తోంది. దీనిపై సిట్(స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) దర్యాప్తు ముమ్మరం చేసింది.జులై 3వ తేదీన మంగళూరు దగ్గరలోని ధర్మస్థల పోలీస్ స్టేషన్లో గుర్తుతెలియని ఒక వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు భారతదేశాన్ని ఉలిక్కి పడేలా చేసిన సంగతి తెలిసిందే. అంతలా అతనిచ్చిన ఫిర్యాదులో ఏముంది అంటే 'నా చేతులతో నేను కొన్ని వందల శవాలను ధర్మస్థలలో అనేక చోట్ల పూడ్చిపెట్టాను. అందులో వివస్త్రలైన మహిళలు, బడికి వెళ్లే అమ్మాయిల శవాలు కూడా ఉన్నాయి. ప్రాణభయంతో ఆ పని చేశాను' అంటూ ఆ వ్యక్తి తన ఫిర్యాదులో పేర్కొనడమే దీనికి కారణం.

**అందరి చూపు ఒకే చోట!**

దీంతో బెంగళూరు ప్రభుత్వం ధర్మస్థల ఘటనలపై సిట్ ను ఏర్పాటు చేసి దర్యాప్తుకుఆదేశించింది. ఈ నేపథ్యంలో సిట్ విచారణ ధర్మస్థలలో మొన్నటి నుంచి కొనసాగుతోంది. మూడో రోజైన ఇవాళ(గురువారం) మృతదేహాలు పాతిపెట్టినట్లు చెప్పిన ప్రాంతాల్లో, ఫిర్యాదు ఇచ్చిన వ్యక్తిని దగ్గర పెట్టుకుని తవ్వకాలు సాగిస్తున్నారు. ఫిర్యాదుదారుడు చెప్పిన 15 ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతున్నాయి. నేడు నాలుగు ప్రాంతాల్లో సిట్ తవ్వకాలు జరుపుతోంది. మొదటి రోజు ఓ ప్రాంతంలో, రెండో రోజు నాలుగు ప్రాంతాల్లో ఇప్పటికే తవ్వకాలు జరిపారు. ఆరు నుంచి ఏడు అడుగుల మేర తవ్వకాలు చేపట్టామని సిట్ అధికారులు చెబుతున్నారు. 5 ప్రాంతాల్లో ఇప్పటివరకూ తవ్వకాలు జరిపినా ఎలాంటి ఆధారాలూ లభించలేదు. అయితే, ఇవాళ ఈ కేసులో బ్రేక్ త్రూ వచ్చింది. ఇవాళ ధర్మస్థలలో 6వ పాయింట్ వద్ద అస్థిపంజరం లభ్యం కావడంతోపాటు, కొన్ని మానవ అవశేషాలు లభ్యం కావడంతో మరింత లోతుకు తవ్వేందుకు నిర్ణయం తీసుకుని ముందుకు సాగుతున్నారు. భారీ భద్రత మధ్య మూడో రోజు తవ్వకాలు కొనసాగుతున్నాయి. చిన్నపాటి యంత్రాలు, డాగ్ స్క్వాడ్ సాయంతో తవ్వకాలు నిర్వహిస్తున్నారు. అధికారుల సమక్షంలో 30 మంది కూలీలతో తవ్వకాలు జరుపుతున్నారు.

# 'నాకు ఆయనకు మనస్పర్థలు ఉన్నాయ్ కలిసి ఎలా పని చేస్తా?: మాజీ మంత్రి



క్వార్జ్ కుంభకోణం కేసులో పోలీసులు కూపీ లాగారు. ఈ నేపథ్యంలో సంచలన నిజాలు వెలుగులోకి వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లాలో క్వార్జ్ అక్రమ రవాణా జరిగినట్లు అందించిన ఫిర్యాదుతో విచారణ చేపట్టారు.ఈ కేసులో ఇప్పటికే మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ తరుణంలో క్వార్జ్ అక్రమ తవ్వకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు.ఇవాళ(శుక్రవారం) మాజీ మంత్రి అనిల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. అక్రమ మైనింగ్ కేసులో నాపేరు ఉందని చెబుతున్నారు. మాజీ మంత్రి కాకాణితో నాకు లావాదేవీలు ఉన్నాయని అంటున్నారు. నా పై అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజానికి.. 'గతంలో కాకాణితో నాకు మనస్పర్థలు ఉండేవి. అలాంటిది మేం ఇద్దరం కలిసి ఎలా వ్యాపారం చేస్తాం' అని మాజీ మంత్రి అనిల్ అన్నారు. ఈ విషయాలపై సీఎం చంద్రబాబుకు లేఖ రాయడానికి కూడా సిద్ధమేనని తెలిపారు. నా దగ్గర వేల కోట్లు ఉన్నాయని నిరూపిస్తే.. అమరావతికి విరాళంగా ఇచ్చేస్తా అని ఆయన తేల్చి చెప్పారు.ఆఫ్రికా, విదేశాల్లో ఆస్తులు కొన్నట్లు రాస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఫ్రికాలో నాకు ఎలాంటి మైన్స్ లేవు. క్వార్జ్ మైనింగ్‌పై ఈడీ విచారణ చేయించండని అన్నారు. ఈడీకి లేఖ రాస్తానని తెలిపారు. నా ఆస్తులపై సిట్ వేయాలని సీఎం చంద్రబాబును డిమండ్ చేశారు. నేను ఎలాంటి అక్రమాస్తులను సంపాదించలేదు. 2008 కి ముందున్న ఇప్పుడున్న ఆస్తులపై విచారణకు తాను సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నా ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించండి. క్వార్జ్ మైనింగ్ పై ఈడీ విచారణ చేయించండి. నాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి అనిల్ మండిపడ్డారు. గతంలో కంటే ఒక్క రూపాయి ఎక్కువ ఉన్నా నన్ను శిక్షించండని చెప్పారు. వెయ్యి కోట్లు ఉన్నాయంటున్నారు.. ఉంటే అమరావతికి తీసుకోండని అన్నారు. గురువారం నెల్లూరులో జరిగిన మాజీ సీఎం జగన్ పర్యటనను అడ్డుకునేందుకు.. 2000 మంది పోలీసులను పెట్టారు. నల్లపురెడ్డి వ్యాఖ్యల కేసులో 4న విచారణకు వెళ్తానని తెలిపారు. జైలుకు వెళ్లేందుకైనా నేను సిద్ధమని అనిల్‌కుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు.

# సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ డాక్టర్ నమ్రతకు ఐదు రోజుల కస్టడీ



రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇవాళ(శుక్రవారం) డాక్టర్ నమ్రతను పోలీసులు కస్టడీకి తీసుకోనున్నారు.రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇవాళ(శుక్రవారం) డాక్టర్ నమ్రతను పోలీసులు కస్టడీకి తీసుకోనున్నారు. ఇవాల్టి నుంచి ఐదు రోజుల పాటు నమ్రతను గోపాలపురం పోలీసులు విచారించనున్నారు. ప్రస్తుతం నమ్రత హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలో ఖైదీగా ఉన్నారు. ఆమెను జైలు నుంచి కస్టడీకి తీసుకోనున్నారు పోలీసులు. నమ్రతపై హ్యూమన్ ట్రాఫికింగ్‌తో పాటు పలు కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. పిల్లలు లేని దంపతులను టార్గెట్‌గా చేసుకుని భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్లో సరోగసి మాటున శిశశివుల విక్రయాలు జరిపినట్లు నిర్ధారణ కావడంతో డాక్టర్ నమ్రతను పోలీసును అరెస్ట్ చేశారు.కొన్నేళ్ల క్రితం సృష్టి ఫర్టిలిటీ సెంటర్ పేరుతో ఓ కేంద్రాన్ని ప్రారంభించిన డాక్టర్ నమ్రత.. పిల్లలు లేని దంపతులే లక్ష్యంగా సోషల్ మీడియా ద్వారా తన కేంద్రానికి విస్తృత ప్రచారం చేసుకున్నారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ట్విటర్, ఫేస్‌బుక్ ద్వారా రకరకాల వీడియోలు, పోస్టులు చేసేవారు. టెస్ట్ ట్యూబ్ బేబీ, సరగసీ విధానాల ద్వారా తల్లిదండ్రులు కావాలనే కోరికను తన ఆస్పత్రిలో నెరవేర్చుకోవచ్చని ప్రచారం చేసేవారు.అంతేకాక, తమ క్లినిక్‌లో ఉచిత పరీక్షలు అంటూ ఆకట్టుకునేవారు. డిజిటల్ ప్రచారంతో సృష్టి ఫర్టిలిటీ సెంటర్ పేరు మార్మోగేలా చేసి పిల్లలు లేని దంపతులు క్యాకట్టేలా చేసుకున్నారు. అనంతరం దంపతుల బలహీనతను ఆసరాగా చేసుకొని అక్రమ మార్గంలో చిన్నారులను కొనుగోలు చేసి వారికి అప్పగించినట్టు తెలుస్తోంది. కాగా, నమ్రత కస్టడీ విచారణలో కీలక విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# మద్యం బాటిళ్ల విషయంలో కేరళ ప్రభుత్వం సరికొత్త నిర్ణయం



**కేరళ రాష్ట్రంలో త్వరలో మద్యం బాటిల్‌పై రూ.20 డిపాజిట్ చేయాలి**

**మద్యం బాటిల్‌పై అదనంగా రూ. 20 ముందస్తు డిపాజిట్**

**ఖాళీ బాటిల్ ను అవుట్‌లెట్‌లో అప్పగిస్తే డబ్బు వెనక్కి**

కేరళ ప్రభుత్వం మద్యం బాటిళ్ల విషయంలో ఒక నూతన నిర్ణయం తీసుకుంది. ప్రతి మద్యం బాటిల్‌పై అదనంగా రూ. 20 ముందస్తు డిపాజిట్ చేయించుకొని, ఆ బాటిల్‌ను తిరిగి అదే అవుట్‌లెట్‌లో డిపాజిట్ చేస్తే, ఆ సొమ్మును తిరిగి చెల్లిస్తారు. త్వరలో దీనిని అమలు చేయనున్నారు. మద్యం సేవించిన అనంతరం బాటిళ్లను ఎక్కడ పడితే అక్కడ పారవేయడం వల్ల తలెత్తుతున్న సమస్యలను నివారించేందుకు కేరళ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.రాష్ట్రవ్యాప్తంగా బేవరేజస్ కార్పొరేషన్ ద్వారా ఏడాదికి 70 కోట్ల సీసాల మద్యం విక్రయాలు జరుగుతున్నాయని కేరళ ప్రభుత్వం పేర్కొంది. అయితే, మొత్తం అమ్ముడవుతున్న మద్యం బాటిళ్లలో కేవలం 56 కోట్ల బాటిళ్లు మాత్రమే రీసైకిల్ అవుతున్నాయి, మిగిలినవి వ్యర్థాలుగా మిగిలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.ఈ విషయాన్ని కేరళ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి ఎంబీ రాజేశ్ వెల్లడించారు. సాధ్యమైనంత వరకు గాజు సీసాల్లోనే మద్యం నింపాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో అది సాధ్యం కాని పక్షంలో రూ. 800 లేదా అంతకంటే ఎక్కువ ధర కలిగిన మద్యాన్ని గాజు సీసాల్లోనే విక్రయించాలని, తక్కువ ధర కలిగిన మద్యాన్ని ప్లాస్టిక్ బాటిళ్లలో నింపవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని సెప్టెంబరులో కొన్ని ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టి, జనవరి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## రేషన్ కార్డుల లబ్ధిదారులకు కార్డులు అందజేసిన మంత్రి సీతక్క



**కొత్తగూడ తెలంగాణ సేన :** తెలంగాణ ప్రభుత్వం ఆహార భద్రత కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ముఖ్య అతిథి గౌరవ శ్రీమతి దనసరి అనసూయ సీతక్క పంచాయతీరాజ్ ౹గ్రామీణ అభివృద్ధి శాఖ , స్త్రీ శిశు సంక్షేమ శాఖ మాత్యులు ..కొత్తగూడ ఎంపీడీవో కార్యాలయం రైతు వేదిక తేదీ ఆగస్టు 01, 2025 మండలంలోని అర్హులైన వారందరికీ నూతన రేషన్ కార్డులు అందజేసిన మంత్రి సీతక్క..నూతన రేషన్ కార్డులు 649 కుటుంబ సభ్యుల సంఖ్య 1143 గత రేషన్ కార్డులో నూతనంగా కుటుంబ సభ్యుల సంఖ్యలో నమోదైన సభ్యుల సంఖ్య 1267 గత పది ఏళ్లలో టిఆర్ఎస్ పాలనలో ఏ ఒక్కరికి కూడా రేషన్ కార్డు వచ్చిన దాఖలు లేవు కాంగ్రెస్ రేవంత్ సర్కార్ ప్రజా ప్రభుత్వం రాగానే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందజేసి సంక్షేమ పథకాల్లో భాగంగా ప్రతి ఒక్కరికి అవకాశం రావాలని నూతన రేషన్ కార్డులు అందజేశారు ప్రతి పేదవాడు సన్న బియ్యం తినాలనే సంకల్పంతో రేషన్ కార్డులు అందుకోబోతున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇకనుండి రేషన్ కార్డ్ లబ్ధిదారులు రేషన్ షాపు ద్వారా సన్న బియ్యం పొందవచ్చును

## వాసవి మాత శ్రవణ మాసం పూజల్లో పాల్గొన్న గౌరీ శంకర్

**అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుంది**



**తెలంగాణ సేన :** అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుందని ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ మండల,పట్టణ యువజన అధ్యక్షుడు గౌరీ శంకర్ అన్నారు శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ సీతారామ ఉమామహేశ్వర ఆలయంలో గల శ్రీ వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాసం పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, పంచామృత అభిషేకం లక్ష పుష్పార్చన సామూహిక వాసవి పారాయణం గోమాతకు పూజలు, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు శ్రావణమాసం సందర్భంగా ఆలయాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్ది ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి పాటలు, భజనలు, కీర్తనలు ఆలపించారు, ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది, వాసవి కన్యకాపరమేశ్వరి మాతశ్రావణ మాసం పూజల్లో పాల్గొని, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ మండల పట్టణ యువజన అధ్యక్షుడు గౌరీ శంకర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మ దయ ఉంటే అంతా మంచి జరుగుతుందని శ్రావణమాసం సందర్భంగా వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజ అత్యంత వైభవంగా నిర్వహించడం సంతోషంగా ఉందని ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి అమ్మ దయ ఉంటుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ మండల అధ్యక్షుడు, నాచారం దేవస్థానం డైరెక్టర్ జగ్గయ్యగారి శేఖర్,ఆర్యవైశ్య నాయకులు కాశీనాథ్, గంగిశెట్టి భాస్కర్, ఆర్యవైశ్య నాయకులు మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు

## వైఎస్ జగన్ నెల్లూరు పర్యటన ఎఫెక్ట్.. వారిపై కేసు నమోదు



ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి నెల్లూరు జిల్లాలో పర్యటించిన విషయం తెలిసిందే.అయితే.. గతంలో వైఎస్ జగన్ పర్యటనలో జరిగిన సంఘటనల నేపథ్యంలో నెల్లూరు పర్యటనకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చారు. దీంతో నెల్లూరు నగర వ్యాప్తంగా ఆంక్షలు అమలు చేశారు.కానీ.. మాజీ సీఎం వైఎస్ జగన్ నెల్లూరు చేరుకున్నారని తెలియగానే వైసీపీ శ్రేణులు ఒక్కసారిగా రోడ్లపైకి భారీగా తరలివచ్చి.. పోలీసులను తోసుకుంటూ వెళ్లాలనే ప్రయత్నం చేశారు. ఈ తరుణంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు నిబంధనలు ఉల్లంఘించడంతో పోలీసులు మూడు కేసులు నమోదు చేశారు.మాజీ మంత్రి ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటికెళ్లే రోడ్డు వద్ద పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను వైసీపీ నాయకులు, కార్యకర్తలు తొలగించి తోసుకుంటూ వెళ్లారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న కావలికి చెందిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ మాలకొండయ్య బారికేడ్ కింద పడిపోయారు. దీంతో ఆయన చేయి విరిగింది.ఈ ఘటన పై ప్రసన్న, బొబ్బల శ్రీనివాస్ యాదవ్, పాతపాటి ప్రభాకర్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే, నిబంధనలకు విరుద్ధంగా బైక్ ర్యాలీ చేపట్టినందుకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. వైఎస్ జగన్(%హ జీుస్త్రుఅ%) పర్యటన సందర్భంగా రోడ్డు పై ధర్నా చేసి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించినందుకు నల్లపరెడ్డి ప్రసన్న, మరికొందరిపై దర్గామిట్ట పోలీసులు కేసు ఫైల్ చేశారు.

## ఉపరాష్ట్రపతి ఎన్నికల షెడ్యూల్ రెడీ.. సెప్టెంబర్ 9న పోలింగ్, ఫలితాలు..!




భారత ఉపరాష్ట్రపతి ఎన్నికలకు ఎన్నికల సంఘం (ఈసీ) కీలక షెడ్యూల్‌ను ప్రకటించింది. సెప్టెంబర్ 9, 2025న పోలింగ్‌తో పాటు ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ మేరకు ఈసీ ఆగస్టు 7న అధికారిక నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ ఎన్నికల ప్రక్రియ దేశ రాజకీయ రంగంలో కీలక ఘట్టంగా నిలవనుంది.నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి, ఆగస్టు 21ని తుది గడువుగా నిర్ణయించారు. అభ్యర్థులు ఈ తేదీలోపు తమ నామినేషన్ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్ల పరిశీలన ఆగస్టు 22న జరగనుంది, ఇది ప్రక్రియలో మరో ముఖ్యమైన అడుగు. ఈ దశలో నామినేషన్ల ఆమోదం లేదా తిరస్కరణపై స్పష్టత వస్తుంది.నామినేషన్ల ఉపసంహరణకు ఆగస్టు 25 వరకు అవకాశం కల్పించారు. ఈ తేదీలోపు అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకునే వెసులుబాటు ఉంది. ఈ షెడ్యూల్‌తో ఎన్నికల సంఘం సునాయాసంగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. రాజకీయ పక్షాలు ఇప్పటికే తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి.ఈ ఎన్నికలు దేశ రాజ్యాంగ వ్యవస్థలో ఉపరాష్ట్రపతి పదవి యొక్క ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తాయి. రాజ్యసభ ఛైర్మన్‌గా కూడా వ్యవహరించే ఈ పదవికి ఎన్నికైన వ్యక్తి దేశ శాసనసభలో కీలక పాత్ర పోషిస్తారు. ఈ ఎన్నికల ఫలితాల కోసం రాజకీయ వర్గాలతో పాటు సామాన్య ప్రజలు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## పొన్నం ప్రభాకర్ ప్రసంగాన్ని అడ్డుకున్న దాసోజు శ్రవణ్

**ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఘటన**

**రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో గందరగోళం**

**కార్పోరేటర్లపై ఎమ్మెల్యే దానం నాగేందర్ మండిపాటు**




హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రసంగి స్తుండగా, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అడ్డుకోవడంతో కొంత గందరగోళం నెలకొంది. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఈ సంఘటన చోటుచేసుకుంది.ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, గత కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. దీనిపై దాసోజు శ్రవణ్, బీఆర్ఎస్ కార్పోరేటర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ప్రసంగాన్ని అడ్డుకున్నారు.కేసీఆర్ పాలనలో 6 లక్షల రేషన్ కార్డులు జారీ చేశామని దాసోజు శ్రవణ్ తెలిపారు. సమస్యలు వివరిస్తామని బీఆర్ఎస్ కార్పొరేటర్లు ప్రయత్నించగా, మంత్రి పొన్నం, ఎమ్మెల్యే దానం నాగేందర్ వారిని వారించారు. కార్పోరేటర్లు తమాషా చేస్తున్నారా అంటూ దానం నాగేందర్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో అక్కడ గందరగోళ పరిస్థితి ఏర్పడింది.

# స్థానికంపై గుబులు.. చేతులెత్తేసిన సర్కార్



రేవంత్ సర్కారుకు స్థానిక సంస్థల ఎన్నికల భయం పట్టుకున్నది. క్షేత్రస్థాయిలో ఆ పార్టీ పరిస్థితి దృష్ట్యా స్థానికంగా భంగపాటు తప్పదని తేలిపోవడంతో రేవంత్ ప్రభుత్వం కుడితిలో పడ్డ ఎలుకలా గిలగిలా కొట్టుకుంటున్నది. అందుకే, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన గడువు ముగిసినా కదలలేకపోతున్నది. దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న అధిష్ఠానాన్ని చూసి కాంగ్రెస్ కార్యకర్తలకు ఎన్నికల గుబులు పట్టుకున్నది. 2024 జనవరి 31తో గ్రామాల్లో సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. అప్పటికే రాష్ట్రంలో రేవంత్ సర్కార్ కొలువుదీరి ఉన్నది. అయితే, గత స్థానిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు, సానుభూతిపరులే సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా, జెడ్పీటీసీలుగా, ఎంపీపీలుగా ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని అన్ని జడ్పీలపై గులాబీ జెండా ఎగిరింది. ఈ నేపథ్యంలో తాజా మాజీ సర్పంచ్‌లను ఇంచార్జిలుగా నియమించేందుకు రేవంత్ ప్రభుత్వం విముఖత చూపింది. గ్రామ కార్యదర్శులకు ఇంచార్జిలుగా బాధ్యతలు అప్పగించింది. అప్పటినుంచి రాష్ట్రంలోని 12 వేల గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ కుర్చీలు బూజుపట్టిపోయాయి. గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్‌కు, ట్రాక్టర్ డీజిల్ ఖర్చులకు కూడా చిల్లి గవ్వ లేని దుస్థితి. దీంతో ఆరుగురు తాజా మాజీ సర్పంచ్‌లు హైకోర్టు మెట్లెక్కారు. ఈ నేపథ్యంలో 2025 సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేయాలని జస్టిస్ టి.రమాదేవి నేతృత్వంలోని ధర్మాసనం 2025 జూన్ 25వ తేదీన రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇచ్చింది. ఆ తీర్పులో భాగంగా వార్డులు, మహిళలు సహా ఇతరవర్గాల రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించింది. అందుకు 30 రోజుల గడువు ఇచ్చింది. ఆ గడువు 2025 జూలై 25తో ముగిసింది. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎన్నికల దిశగా ఒక్క అడుగు ముందుకు వేయలేదు. అందుకు ప్రధాన కారణం స్థానిక ఎన్నికలకు వెళ్తే ఓడిపోతామనే భయమే.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుచుకున్న సీట్లలో అత్యధికం గ్రామీణ ప్రాంతాల్లోనే. మార్పు పేరిట చేసిన మాయ, వారంటీ లేని ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇవ్వడంతో పల్లె ప్రజలు కాంగ్రెస్‌ను నమ్మారు. కానీ, నమ్మినవాళ్లను తెగనమ్మే కాంగ్రెస్ అధికార పీఠం ఎక్కిన వెంటనే తన బుద్ధిని బయట పెట్టింది. గద్దెనెక్కించిన గ్రామీణులను వంచించింది. కాళేశ్వరాన్ని పండబెట్టి, పంటలను ఎండబెట్టింది. రెండు సీజన్ల రైతు భరోసాను ఎగ్గొట్టింది. రైతు కూలీలు, కౌలు రైతులకు భరోసా లేకుండాపోయింది. వడ్లకు బోనస్ వెక్కిరిస్తున్నది. తెలంగాణ ఆడబిడ్డలకు ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదు. నెలనెలా ఇస్తామన్న రూ.2,500 ఆర్థిక సాయం అటకెక్కింది. తులం బంగారం కాదు కదా, లక్ష కూడా ఇవ్వడం లేదు. పింఛన్లు పెంచలేదు. 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వకుండా, రాజీవ్ యువ వికాసం పేరిట యువతను మరోసారి వంచించారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. ఇందిరమ్మ ఇండ్ల పేర కమీషన్ల దందా నడుస్తున్నది. ఇలా పల్లె ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నో హామీలలో ఒకటీ అరా తప్ప, అమలుకాలేదు. దాంతో అధికారం చేపట్టిన ఆరు నెలల్లోపే రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై పల్లె ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను రైతులు, ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. వాస్తవానికి, అధికార పార్టీ తరఫున స్థానిక సంస్థల్లో పోటీ చేసేందుకు ఆశావహుల తాకిడి తీవ్రంగా ఉంటుంది. కానీ, కాంగ్రెస్ పరిస్థితి వేరు. మూడు రంగుల జెండా పట్టుకొని ప్రజల్లోకి వెళ్లేందుకు ఆ పార్టీ కార్యకర్తలే జంకుతున్నారు. అందుకు ప్రభుత్వంపై వ్యతిరేకత ప్రధాన కారణం. స్థానిక ఎన్నికలకు వెళ్లే ధైర్యం లేక కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కూడా సాకుగా చూపుతున్నది. వాస్తవానికి బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశం కాంగ్రెస్‌కు లేనే లేదు. అందుకే, ప్రామాణికత లేని సర్వేను తప్పుల తడకగా నిర్వహించింది. పారదర్శకత లేని సర్వే, చట్టబద్ధత లేని కమిషన్, న్యాయస్థానాల ముందు నిలవని ఆర్డినెన్స్‌ల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 21, 19 (1), (ఏ)లను ఉల్లంఘించింది. ఎస్ఈఈఈపీసీ సర్వే, బూసాని వెంకటేశ్వరరావు కమిషన్ నివేదికలను ఇప్పటివరకు అసెంబ్లీలో టేబుల్ చేయలేదు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని ఎక్స్‌పర్ట్ వర్కింగ్ గ్రూప్ నివేదికను బహిరంగపరచలేదు. స్థానిక సంస్థలు, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే రెండు వేర్వేరు బిల్లులను 2025, మార్చి 25న తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్ ద్వారా ఆ బిల్లులను రాష్ట్రపతికి పంపించింది.

పలు విషయాల్లో స్పష్టత కోసం ఆ బిల్లులను రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రపతి తిరిగి పంపించినట్టు తెలుస్తున్నది. అదే నిజమైతే, ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు అధికారికంగా ప్రకటన ఇవ్వలేదు? రాష్ట్రపతి ఏ విషయాలపై స్పష్టత కోరారు? వాటిని ప్రభుత్వం ఎప్పుడు పొందుపరుస్తుంది? సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో, అదేరోజు హడావుడిగా లీగల్ ఒపీనియన్ తీసుకోకుండా ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. ఇదివరకే అసెంబ్లీ ఆమోదించిన అసలైన బిల్లులు రాష్ట్రపతి వద్ద ఉండగానే, అదే అంశంపై ఆర్డినెన్స్ తీసుకురావడం అంటే ఆర్టికల్ 213(1) (ఏ)ను ఉల్లంఘించడమే. ఈ ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించారా లేదా అనే విషయంపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదు. కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చినట్టుగా సబ్ క్యాటగరైజేషన్‌ను ఈ ఆర్డినెన్స్‌లో పొందుపరచలేదు. ఇలా ఎన్నో తప్పులను చేసి బీసీ రిజర్వేషన్లు సాకుగా చూపుతూ ఎన్నికలు నిర్వహించకుండా తప్పించుకుంటున్నారు. ఒకవైపు రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించిన బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం పెండింగ్‌లో ఉండగానే, హడావుడిగా ఆర్డినెన్స్ తీసుకువచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మరో నాటకానికి తెరలేపారు. గతంలో బిల్లులను రాష్ట్రపతికి పంపించకుండానే బిల్లుల ఆమోదం కోసమని ఢిల్లీలో ధర్నా డ్రామా చేశారు. ఆ డ్రామాకు కనీసం రాహుల్ కూడా హాజరుకాలేదు.

ఇప్పుడు ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదించారో, తిరస్కరించారో స్పష్టం చేయకుండా ఢిల్లీలో ఆగస్టు 5, 6, 7వ తేదీల్లో మరో డ్రామాను రక్తి కట్టించేందుకు సిద్ధమయ్యారు. ఒకవైపు ఆర్డినెన్స్ తీసుకువచ్చి, మరోవైపు బిల్లుల ఆమోదం కోసం మళ్లీ ఢిల్లీ టూర్‌కు వెళ్తామనడం విడ్డూరం. రాష్ట్రంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించకుండా, రాష్ట్రపతి, ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకువెళ్లకుండా ముఖ్యమంత్రి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను తీసుకువెళ్తామనడం రాజకీయ పబ్బం గడుపుకోవడానికేనని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేండ్లు కావస్తున్నది. మరో మూడేండ్లు మాత్రమే రేవంత్ సర్కార్‌కు సమయం ఉన్నది. చివరి ఏడాది ఎలాగూ అసెంబ్లీ ఎన్నికల హడావుడి ఉంటుంది. మిగిలిన రెండేండ్లలో అయినా గ్రామాలను అభివృద్ధి చేసే పరిస్థితి లేదు. డీజిల్ పోసేందుకు పైసలు లేక గ్రామ కార్యదర్శులు ట్రాక్టర్లను ఉన్నతాధికారులకు అప్పగిస్తున్న దుస్థితి. ఖజానా ఖాళీ అయిందని, లంకె బిందెలు లేవని, అప్పు పుట్టడం లేదని, చెప్పులు ఎత్తుకెళ్లే దొంగలా చూస్తున్నారని చెప్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎప్పుడో చేతులెత్తేశారు. అందుకే, ప్రజల తిట్లు, శాపనార్థాలలో మునిగితేలుతూ, వ్యతిరేకతలో తడిసి ముద్దవుతూ కాంగ్రెస్ మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు స్థానిక ఎన్నికలపై పొంతన లేని ప్రకటనలు ఇస్తూ తప్పించుకొని తిరుగుతున్నారు.

## రోజూ 3 అంజీర్ పండ్లను నానబెట్టి తింటే కలిగే అద్భుతమైన ప్రయోజనాలు ఇవే..!



ఆరోగ్యం పట్ల శ్రద్ధ ఉన్నవారు ఆరోగ్యకరమైన ఆహారాలను తినేందుకు ఆలోచిస్తుంటారు. ఎలాంటి ఆహారాలను తినాలని అన్వేషిస్తుంటారు. అయితే అలాంటి వారికి అంజీర్ ఎంతగానో మేలు చేస్తాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. అంజీర్ పండ్లు మనకు రెండు రకాలుగా మార్కెట్‌లో లభిస్తాయి. సాధారణ పండ్లతోపాటు ఇవి డ్రై ఫ్రూట్స్ రూపంలోనూ అందుబాటులో ఉంటాయి. అంజీర్ పండ్లు మనకు కేవలం సీజన్‌లోనే లభిస్తాయి. కానీ డ్రై ఫ్రూట్స్ మాత్రం ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయి. కనుక డ్రై ఫ్రూట్స్‌ను తినవచ్చని వైద్యులు చెబుతున్నారు. అంజీర్ పండ్లను తినడం వల్ల అనేక పోషకాలు లభించడంతోపాటు వ్యాధులు నయమవుతాయని చెబుతున్నారు. అయితే అంజీర్ పండ్లను నేరుగా తినలేరు. కనుక నీటిలో నానబెట్టి తినాలి. రాత్రి పూట 3 అంజీర్ పండ్లను నీటిలో నానబెట్టి వాటిని మరుసటి రోజు ఉదయం బ్రేక్ ఫాస్ట్‌లో భాగంగా తింటే ఎంతో మేలు జరుగుతుంది.

**జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..**

అంజీర్ పండ్లలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. అందువల్ల ఈ పండ్లను తింటే మలబద్ధకం అన్న మాటే ఉండదు. ఈ పండ్లు ప్రీ బయోటిక్ ఆహారంగా పనిచేస్తాయి. అంటే ఈ పండ్లను తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. దీంతో మనం తినే ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీని వల్ల పోషకాహార లోపం నుంచి బయట పడవచ్చు. అంజీర్ పండ్లను తినడం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం వంటి జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. అంజీర్ పండ్లలో సహజసిద్ధమైన చక్కెరలు ఉంటాయి. గ్లూకోజ్, ఫ్రక్టోజ్‌లతోపాటు పొటాషియం, మెగ్నిషియం అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ పండ్లను ఉదయం తింటే శరీరానికి రోజంతటికీ కావల్సిన శక్తి లభిస్తుంది. రోజంతా శక్తి స్థాయిలు అలాగే ఉంటాయి. నీరసం, అలసట తగ్గుతాయి. ఎంత పనిచేసినా అలసిపోరు. ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా మారుతారు. బద్ధకం పోతుంది.

**ఎముకల పటిష్టతకు..**

అంజీర్ పండ్లలో క్యాల్షియం, మెగ్నిషియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకల సాంద్రతను పెంచి ఎముకలు పటిష్టంగా మారేలా చేస్తాయి. అంజీర్ పండ్లను నానబెట్టడం వల్ల ఈ పోషకాల శాతం మరింత పెరుగుతుంది. ఈ పండ్లను తింటే ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. వయస్సు మీద పడడం వల్ల వచ్చే ఆస్టియోపోరోసిస్ వంటి సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. ముఖ్యంగా మెనోపాజ్ దాటిన మహిళలకు ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. వెన్నెముక సమస్యలు రాకుండా ఉంటాయి. ఈ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది కనుక వీటిని తింటే శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది. రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. బీపీ తగ్గుతుంది. హైబీపీ నియంత్రణలో ఉంటుంది. రక్త సరఫరా మెరుగు పడుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. రక్త నాళాలు సైతం ఆరోగ్యంగా ఉంటాయి.

**బరువు తగ్గేందుకు..**

అంజీర్ పండ్లను తినడం వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధికంగా బరువు ఉన్నవారు ఈ పండ్లను తింటుంటే బరువు తగ్గడం చాలా తేలికవుతుంది. అంజీర్ పండ్లు తియ్యగా ఉన్నప్పటికీ వీటి గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల షుగర్ లెవల్స్ పెరగవు. కనుక షుగర్ ఉన్నవారు సైతం ఈ పండ్లను నిర్భయంగా తినవచ్చు.

పైగా ఈ పండ్లలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్‌ను తగ్గించేందుకు దోహదం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ పండ్లను తింటుంటే ఎంతగానో మేలు జరుగుతుంది. అంజీర్ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. పాలిఫినాల్స్, ఫ్లేవనాయిడ్స్, కెరోటినాయిడ్స్ ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో శరీరంలో అంతర్గతంగా వచ్చే వాపులు తగ్గిపోతాయి. ఫలితంగా క్యాన్సర్, గుండె పోటు వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా చూసుకోవచ్చు. ఇలా రోజూ రాత్రి 3 అంజీర్ పండ్లను నీటిలో నానబెట్టి వాటిని మరుసటి రోజు ఉదయం తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది.


## తేనెటీగల తేనే కాదు.. విషం సైతం ఔషధమే..! రొమ్ము క్యాన్సర్‌ను ఖతం చేస్తుందట..

తేనెటీగలు రొమ్ము క్యాన్సర్ కణాలను నాశనం చేయగలవని ఒక అధ్యయనం వెల్లడించింది. తేనెటీగ విషంలో ఉండే ఒక మూలకం రొమ్ము క్యాన్సర్ కణాలను నాశనం చేయగలదని ఒక అధ్యయనంలో తేలింది. భవిష్యత్తులో ఈ విషాన్ని క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే... తేనెటీగలు ప్రకృతి నుండి తేనెను సేకరిస్తాయి. ఇది ఔషధ గుణాలకు నిలయం. ఆయుర్వేదంలో తేనెను ప్రభావవంతమైన ఔషధంగా పరిగణిస్తారు. ఇది అనేక ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. తేనెటీగల నుండి వచ్చే తేనె ప్రయోజనాలు దాదాపు మనందరికీ తెలుసు. కానీ, తేనెటీగలు కుట్టినప్పుడు స్రవించే విషం కూడా శక్తివంతమైన ఔషధంగా పనిచేస్తుందని మీకు తెలుసా.? తేనెటీగలు రొమ్ము క్యాన్సర్ కణాలను నాశనం చేయగలవని ఒక అధ్యయనం వెల్లడించింది. తేనెటీగ విషంలో ఉండే మెలిటిన్ అనే మూలకం రొమ్ము క్యాన్సర్ కణాలను నాశనం చేయగలదని ఒక అధ్యయనంలో తేలింది. భవిష్యత్తులో ఈ విషాన్ని క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించవచ్చునని పరిశోధకులు చెబుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే ఆస్ట్రేలియాలోని హ్యారీ పెర్కిన్స్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ నివేదిక ఇటీవలి పరిశోధన ప్రకారం, తేనెటీగ విషం రొమ్ము క్యాన్సర్ కణాలను నాశనం చేయడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ముఖ్యంగా ఇది ట్రిపుల్-నెగటివ్ బ్రెస్ట్ క్యాన్సర్ వంటి అత్యంత ప్రాణాంతక వ్యాధి నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఈ పరిశోధన పశ్చిమ ఆస్ట్రేలియాలో జరిగింది. దీనిలో శాస్త్రవేత్తలు తేనెటీగలు, బంబుల్బీల విషాన్ని ఉపయోగించి పరిశోధనలు నిర్వహించారు. ఈ అధ్యయనం తేనెటీగ విషం రొమ్ము క్యాన్సర్ కణాలను వేగంగా నాశనం చేయగలదని, అయితే ఇది సాధారణ కణాలపై చాలా తక్కువ ప్రభావాన్ని చూపుతుందని వెల్లడించింది. ఈ పరిశోధనలో గుర్తించబడిన కీలకమైన అంశం మెలిటిన్. ఇది తేనెటీగ విషం చిన్న ద్రవం. కానీ, ఇది ప్రభావవంతమైన పెప్టైడ్. మెలిటిన్ ట్రిపుల్-నెగటివ్ రొమ్ము క్యాన్సర్, 2 రొమ్ము క్యాన్సర్ కణాల పొరను 60 నిమిషాల్లో పూర్తిగా నాశనం చేసింది. క్యాన్సర్ కణాల పెరుగుదల, విభజనను నియంత్రించే రసాయన సంకేతాలను కూడా మెలిటిన్ అణిచివేసింది. ఈ ప్రక్రియ క్యాన్సర్ కణాల జీవశక్తిని బాగా తగ్గించింది. అయితే సాధారణ కణాలు సురక్షితంగా ఉన్నాయి. మెలిటిన్‌ను కీమోథెరపీ మందులతో కలిపి ఉపయోగించవచ్చు. మెలిటిన్ క్యాన్సర్ కణాల పొరలో రంధ్రాలను సృష్టించగలదు. కీమోథెరపీ వంటి ఇతర మందులు కణంలోకి ప్రవేశించడాన్ని సులభతరం చేస్తుంది. ఈ కలయిక మౌస్ నమూనాలలో కణితి పెరుగుదలను గణనీయంగా తగ్గించగలిగింది.



ఈ కలయిక అత్యంత దూకుడుగా ఉండే రొమ్ము క్యాన్సర్ చికిత్సలో కొత్త దిశను అందించగలదని పరిశోధకులు అంటున్నారు.మెలిటిన్ ఉపయోగించే పద్ధతి, దాని మోతాదు, విషపూరితంపై మరిన్ని పరిశోధనలు జరగాలని పరిశోధకులు విశ్వసిస్తున్నారు. అయితే, సహజ వనరుల నుండి పొందిన మెలిటిన్, తేనెటీగ విషం వంటి అంశాలు క్యాన్సర్ చికిత్సలో కొత్త ఆశను రేకెత్తిస్తాయని ఈ అధ్యయనం స్పష్టం చేస్తుంది. భవిష్యత్తులో, ఈ అధ్యయనం క్యాన్సర్ చికిత్సలో కొత్త విప్లవాన్ని తీసుకురాగలదని పరిశోధకులు ఆశిస్తున్నారు..

## నల్ల మచ్చలున్న ఉల్లిపాయలు వాడుతున్నారా? జాగ్రత్త .!



నల్ల మచ్చలున్న ఉల్లిపాయలు వంటకు వాడటం, తినడం ఆరోగ్యానికి మంచిదేనా? వాటిని తింటే ఎలాంటి ప్రభావాలు ఉంటాయి? ఈ విషయంపై ఆరోగ్య నిపుణులు ఏం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం.. ఉల్లిపాయలు మన వంటగదిలో ఒక ప్రధానమైన కూరగాయ. ఇవి లేకుంటే వంట రుచి రుచి అసంపూర్ణంగా ఉంటుంది. అయితే, కొన్నిసార్లు ఉల్లిపాయలపై నల్ల మచ్చలు లేదా బూజు (ఫంగస్) కనిపిస్తుంటాయి. అలాంటి ఉల్లిపాయలు తినడం మీ ఆరోగ్యానికి హానికరం కావచ్చు అనే విషయం మీకు తెలుసా? అలాంటి ఉల్లిపాయలను వాడటం ఆరోగ్యానికి చాలా ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అయితే, నల్ల మచ్చలు ఉన్న ఉల్లిపాయలు ఎందుకు వాడకూడదు? వాడితే ఏలాంటి ప్రభావాలు ఉంటాయి? అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం..

**చెడు ప్రభావం**

నల్ల మచ్చలు లేదా బూజు ఉన్న ఉల్లిపాయలను ఎప్పుడూ ఉపయోగించకూడదని నిపుణులు చెబుతున్నారు. దానిలో మైకోటాక్సిన్ అనే విషపదార్థాలు కలిగిన ఒక రకమైన టాక్సిన్ ఏర్పడుతుందని, ఇది శరీరంపై చెడు ప్రభావాన్ని చూపుతుందని హెచ్చరిస్తున్నారు. అలాంటి ఉల్లిపాయలు తినడం వల్ల ఫుడ్ అలెర్జీ, వాంతులు , విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు. అంతేకాకుండా, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులకు కూడా ఇది దారితీస్తుందని హెచ్చరిస్తున్నారు. అందువల్ల, అలాంటి ఉల్లిపాయలను కడిగి లేదా కట్ చేసి వాడటానికి బదులుగా, వాటిని నేరుగా పారవేయడమే మంచిదని సూచిస్తున్నారు.

**తాజా ఉల్లిపాయలను వాడండి**

ఎప్పుడూ తాజా, శుభ్రమైన ఉల్లిపాయలను ఉపయోగించాలని నిపుణులు సలహా ఇస్తున్నారు. తాజా ఉల్లిపాయలు తినడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. వీటిలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీమైక్రోబయల్ లక్షణాలు ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడానికి, గుండె ఆరోగ్యాన్ని కాపాడడానికి, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి, కొన్ని రకాల క్యాన్సర్లను నివారించడానికి సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు.

**నల్ల మచ్చలను ఎలా నివారించాలి?**


ఉల్లిపాయలపై నల్ల మచ్చలు లేదా ఫంగస్ రాకుండా నిరోధించడానికి వాటిని సరిగ్గా నిల్వ చేయడం చాలా ముఖ్యం . చాలా మంది ఉల్లిపాయలను పదే పదే కొనకుండా ఉండటానికి ఒకేసారి చాలా కొంటారు. దీనివల్ల నిల్వ చేసేటప్పుడు మచ్చలు, ఫంగస్ అభివృద్ధి చెందుతాయి. ఉల్లిపాయలను చల్లని ప్రదేశాలలో, ఫ్రిజ్‌లో లేదా తేమతో కూడిన ప్రదేశాలలో అస్సలు ఉంచవద్దు. వర్షాకాలంలో ఉల్లిపాయలలో ఫంగస్ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి, ఈ సీజన్‌లో మీ వినియోగానికి అనుగుణంగా ఉల్లిపాయలను కొనండి. తద్వారా అవి తాజాగా ఉంటాయి. మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి .

## మొక్కజొన్న కంకులు ఉడికించినవా.. కాల్చినవి తినాలా..



మొక్కజొన్నల కాలం వచ్చేసింది. వీటిలో పోషకాలు తెలియచేయండి. నిప్పులపై కాల్చినవి తింటే మంచిదా, ఉడికించినవా? ఈ పోషకాల్లో ఏమైనా తేడాలుంటాయా? వందగ్రాముల ఉడికించిన మొక్కజొన్న గింజల్లో దాదాపు వంద క్యాలరీలు ఉంటాయి. అన్ని రకాల ముడి ధాన్యాల్లానే మొక్కజొన్నలో కూడా పిండి పదార్థాలు అధికం. ఈ పిండిపదార్థాల్లో భాగంగానే కొంత చక్కెర కూడా మొక్కజొన్న గింజల్లో ఉంటుంది. అంతేకాదు మొక్కజొన్న గింజల్లో కొంతవరకు పీచుపదార్థం కూడా ఉంటుంది. మొక్క జొన్న పేలాల్లో కూడా పీచుపదార్థం ఉంటుంది. బీ3, బీ5, బీ6, బీ9 మొదలైన విటమిన్లు, పొటాషియం, మెగ్నీషియం, మాంగనీస్, జింక్ లాంటి ఖనిజాలు మొక్కజొన్న గింజలో, పేలాల్లోనూ లభిస్తాయి. అధిక పిండి పదార్థాలు ఉండడం వలన మధుమేహం ఉన్నవారు వివిధ రకాల ధాన్యాలతో పాటు మొక్కజొన్నను పరిమిత మోతాదులోనే తీసుకోవాలి. మొక్కజొన్నలో ఉండే ల్యూటిన్, జియాగ్జాన్థిన్ అనే యాంటీఆక్సిడెంట్స్ కంటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మొక్కజొన్న కంకులను తక్కువ నీటిలో ఆవిరిపై ఉడికిస్తే వాటిలోని పోషకాలకు ఎక్కువ నష్టం కలగకుండా చూసుకోవచ్చు. ఒకవేళ బొగ్గులపై లేదా మంటలో నేరుగా కాల్చి నట్టయితే ఎక్కువ కాలినా లేదంటే కొద్దిగా మాడినా ఆ గింజలను పక్కకు తీసేసి మిగిలినవి తినడం మంచిది. మాడిన గింజల్లో క్యాన్సర్ కారక పదార్థాలు ఉండే అవకాశం ఎక్కువ.

## మీ ఇంటిని ఎప్పుడూ ఫ్రెష్ గా ఉంచాలంటే.. ఈ టిప్స్ ట్రై చేయండి..!



వంటగదిలో చెత్త డబ్బా శుభ్రంగా లేకపోతే దుర్వాసన ఇంటి నిండా వ్యాపిస్తుంది. ముఖ్యంగా తడి చెత్త వల్ల వచ్చే వాసన చాలా ఇబ్బంది పెడుతుంది. కానీ భయపడాల్సిన పని లేదు. ఇంట్లోనే సులువుగా దొరికే కొన్ని చిట్కాలతో ఈ సమస్యను తగ్గించుకోవచ్చు. ఈ చిట్కాలు మీ వంటగదిని శుభ్రంగా, సువాసనతో ఉంచడానికి సహాయపడతాయి. వంటగదిలో చెత్త డబ్బా శుభ్రంగా లేకపోతే.. దాని వాసన ఇల్లంతా పాకే ప్రమాదం ఉంది. ముఖ్యంగా తడి చెత్త, కూరగాయల తొక్కలు, టీ పొడి లాంటివి ఎక్కువసేపు ఉండిపోతే భయంకరమైన దుర్వాసన వస్తుంది. అందువల్ల వంటగదిలో శుభ్రతను కాపాడుకోవడం చాలా అవసరం.

**చెత్తను రోజూ తీసేయండి**

తడి చెత్తను ఒకరోజు కంటే ఎక్కువ చెత్త డబ్బాలో ఉంచితే అది పాడై, దుర్వాసన రావడం మొదలవుతుంది. కాబట్టి ప్రతిరోజూ ఒకసారి చెత్తను తీసేయడం అలవాటు చేసుకోవాలి. అలాగే చెత్త డబ్బా మూత తెరిచి ఉంచితే వాసన వ్యాపిస్తుంది. కాబట్టి మూతను ఎప్పుడూ మూసి ఉంచడం మంచిది.

**వారానికోసారి మస్ట్**

చెత్తను తీసేయడం మాత్రమే సరిపోదు. చెత్త డబ్బాను కూడా వారానికి కనీసం ఒకసారి శుభ్రంగా కడగాలి. గోరువెచ్చటి నీటిలో కొద్దిగా వెనిగర్, డిష్ వాష్ లిక్విడ్ కలిపి ఆ నీటితో చెత్త డబ్బా పూర్తిగా కడగండి. ఇలా చేయడం వల్ల దుర్వాసన పోతుంది.

**పేపర్ తో తేమకు చెక్**

చెత్త డబ్బాలో తడి పదార్థాల తేమను పీల్చుకోవడానికి.. డబ్బా అడుగున పాత వార్తాపత్రిక లేదా బ్రౌన్ షీట్ కాగితాన్ని పరచండి. దీని పైన పాలిథిన్ కవర్ వేసి ఆ తర్వాత చెత్తను వేయండి. ఇది చెత్తలోని తేమను లాక్కొని.. నెమ్మదిగా ఆరిపోయేలా చేస్తుంది.

**బేకింగ్ సోడాతో దుర్వాసనకు చెక్**

ప్రతిసారి చెత్త వేసే ముందు చెత్త డబ్బా అడుగున 1 నుంచి 2 స్పూన్ల బేకింగ్ సోడాను చల్లండి. ఇది తేమను గ్రహించి.. దుర్వాసన రాకుండా ఆపుతుంది. సులభంగా దొరికే ఇది.. వంటగదిలో మంచి వాసన ఉండేలా చేస్తుంది.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY



# నో శాలరీ హైక్స్, సీనియర్ల నియామకాలు నిలిపివేత.. ఉద్యోగులకు టీసీఎస్ మరో షాక్..!




భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పెద్ద ఎత్తున లేఆఫ్స్ ప్రకటించిన విషయం తెలిసిందే. తన మొత్తం ఉద్యోగుల్లో 2 శాతం మందికి ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. వచ్చే ఏడాది కల్లా దాదాపు 12,200 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడనున్నది. మధ్య స్థాయి, సీనియర్ స్థాయి ఉద్యోగులపై అధికంగా వేటు పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివేశన్ మనీకంట్రోల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.అయితే, ఈ లేఆఫ్స్ ప్రకటన అనంతరం సంస్థ తాజాగా మరికొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలిసింది. కొత్త ఉద్యోగ నియామకాలను నిలిపివేసినట్లు సమాచారం. ఈ ఆర్థిక సంవత్సరంలో సీనియర్ లెవెల్ ఉద్యోగులను రిక్రూట్ చేసుకోకూడదని నిర్ణయించినట్లు తెలిసింది. అదేవిధంగా వార్షిక వేతనాల పెంపు, ఇంక్రిమెంట్లకు కూడా ఫుల్ స్టాప్ పెట్టినట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగానే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి.ంతేకాదు, బెంచ్‌పై నియమిత కాలం కంటే ఎక్కువగా ఉన్న సిబ్బందిని కూడా తొలగించే ప్రక్రియను మొదలు పెట్టినట్లు సమాచారం. ఇప్పటికే ఉద్యోగులు 35 రోజులకు మించి బెంచ్‌పై ఉండకూడదనే నియమాన్ని టీసీఎస్ అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. ఇక మధ్యస్థ, సీనియర్ స్థాయి ఉద్యోగుల తొలగింపు ద్వారా టీసీఎస్‌కి ఏటా 300 నుంచి 400 మిలియన్ డాలర్లు అంటే రూ.2,400 కోట్ల నుంచి రూ. 3,600 కోట్ల వరకూ ఆదా అవుతుందని ఓ సీనియర్ ఐటీ విశ్లేషకుడు అంచనా వేశారు.

**టీసీఎస్‌లో 12వేల మంది ఔట్..!**

కృత్రిమ మేద రాకతో ప్రయోజనాల సంగతి ఏమోగానీ ఐటీ ఉద్యోగాలపై దీని ప్రభావం మాత్రం గట్టిగానే పడుతోంది. ఏఐ పుణ్యమాని ఇప్పటికే పలు దిగ్గజ సంస్థలు తమ స్టాఫ్‌ను తగ్గించుకుంటున్నాయి. భారత్‌లోని అతి పెద్ద ఐటీ సర్వీసుల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) తన మొత్తం ఉద్యోగులలో 2 శాతం మందికి ఉద్వాసన పలకనున్నది. వచ్చే ఏడాది కల్లా దాదాపు 12,200 మంది ఉద్యోగులపై దీని ప్రభావం పడనున్నది. మధ్య స్థాయి, సీనియర్ స్థాయి ఉద్యోగులపై అధికంగా వేటు పడే అవకాశం ఉంది. ఈ విషయాన్ని టీసీఎస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కే కృతివేశన్ మనీకంట్రోల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.అత్యంత వేగంగా సాంకేతిక మార్పులు చోటుచేసుకుంటున్న వేళ భవిష్యత్తు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సంసిద్ధంగా ఉండక తప్పదని ఆయన అన్నారు. ఉద్యోగుల సంఖ్యను ఎందుకు తగ్గించవలసి వస్తోందన్న ప్రశ్నకు యావత్ ఐటీ పరిశ్రమ మార్పు చెందుతున్నదని, పని చేసే విధానాలు మారుతున్నాయని ఆయన బదులిచ్చారు. 2025 జూన్ నాటికి ప్రపంచవ్యాప్తంగా 6.13 లక్షల మంది టీసీఎస్ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 2 శాతం మంది అంటే సుమారు 12,200 మంది ఉంటారు. లమిడిల్ మేనేజ్‌మెంట్, సీనియర్ లెవెల్స్‌లో అధికంగా ఉంటాయని కృతివాసన్ స్పష్టం చేశారు

# పడకేసిన పారిశ్రామికోత్పత్తి.. కీలక రంగాలు కుదేలు

**పడకేసిన పారిశ్రామికోత్పత్తి.. కీలక రంగాలు కుదేలు**

**గనులు, విద్యుదుత్పత్తిలో నిస్తేజం**

**జూన్‌లో 1.5 శాతంగానే వృద్ధిరేటు**

**గత నెల 10 నెలల కనిష్ఠానికి ఐఐపీ పతనం**

దేశీయ పారిశ్రామిక రంగాన్ని నిస్తేజం ఆవరించింది. ఈ ఏడాది మొదలు పారిశ్రామికోత్పత్తి క్షీణిస్తున్నది మరి. మార్చి నుంచి క్రమేణా పడిపోతున్న వృద్ధిరేటు.. గత నెల దాదాపు ఏడాది కనిష్ఠాన్ని తాకింది. దేశంలో కీలక రంగాలు కుదేలవుతున్నాయి. ఆర్థిక, వ్యాపార, పారిశ్రామిక వృద్ధికి దోహదపడే అంశాల్లో నిస్తేజం కనిపిస్తున్నది.అసలే అంతర్జాతీయంగా విపత్కర పరిస్థితులు నెలకొన్న వేళ..ఈ ప్రతికూల ంకేతాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయిప్పుడు. గడిచిన 4 నెలలుగా భారతీయ పారిశ్రామికోత్పత్తి సూచీ కదలికలు తీవ్ర నిరాశనే మిగులుస్తున్నాయి.అంతకంతకూ పతనమవుతున్న ఉత్పాదక వృద్ధి.. గత నెల జూన్‌లో 10 నెలల కనిష్ఠాన్ని తాకుతూ 1.5 శాతానికి పరిమితమైంది. గనులు, విద్యుత్తు రంగాల్లో ఉత్పత్తి నత్తనడకన సాగుతున్నదని తాజాగా విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాలే చెప్తుండటం గమనార్హం దేశీయ పారిశ్రామిక రంగాన్ని నిస్తేజం ఆవరించింది. ఈ ఏడాది మొదలు పారిశ్రామికోత్పత్తి క్షీణిస్తున్నది మరి. మార్చి నుంచి క్రమేణా పడిపోతున్న వృద్ధిరేటు.. గత నెల దాదాపు ఏడాది కనిష్ఠాన్ని తాకింది. జూన్‌లో 10 నెలల కనిష్ఠ స్థాయిని సూచిస్తూ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 1.5 శాతానికే పరిమితమైందని సోమవారం విడుదలైన అధికారిక గణాంకాల్లో తేలింది. గత ఏడాది ఆగస్టు తర్వాత ఈ స్థాయిలో ఉత్పాదక వృద్ధి నమోదు కావడం ఇదే తొలిసారి. ఇక నిరుడు జూన్‌లో 4.9 శాతం వృద్ధిని ఐఐపీ చూపింది.

**గనులు, విద్యుత్తు రంగాలు డీలా**

గనులు, విద్యుత్తు రంగాల్లో ఉత్పాదకత డీలా పడింది. అయితే దేశ ఆర్థిక ప్రగతికి రథ చక్రాలైన ఈ రెండు రంగాల్లో మందగమనం ఇలాగే కొనసాగితే.. మొత్తం జీడీపీ వృద్ధిని అది ప్రభావితం చేస్తుందన్న ఆందోళనలుఇప్పుడు కని




పిస్తున్నాయి. ఏడాది క్రిందటితో పోల్చితే ఈ జూన్‌లో గనుల రంగంలో ఉత్పత్తి వృద్ధిరేటు 10.3 శాతం నుంచి 8.7 శాతానికి తగ్గింది. ఫలితంగా విద్యుదుత్పత్తిపై పెద్ద ఎత్తునే ప్రభావం పడింది. పోయినసారి జూన్‌లో దేశీయ విద్యుదుత్పత్తిలో 8.6 శాతం వృద్ధి నమోదైంది. కానీ ఈ జూన్‌లో 2.6 శాతంగానే ఉన్నది. ఇప్పటికీ దేశంలో విద్యుత్తు అవసరాలు అత్యధికంగా తీరేది బొగ్గు ద్వారానే. దీంతో తగ్గిన బొగ్గు ఉత్పత్తి ప్రభావం.. వెంటనే విద్యుత్తు తయారీపై కనిపించిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు.

**తయారీ వృద్ధీ అంతంతే..**

కీలకమైన తయారీ రంగంలోనూ గత నెల వృద్ధిరేటు అంతంతమాత్రంగానే ఉన్నది. గత ఏడాది జూన్‌లో 3.5 శాతంగా నమోదవగా, ఈ జూన్‌లో అది 3.9 శాతానికి పెరిగిందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్‌వో) తమ తాజా నివేదికలో వెల్లడించింది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో ఐఐపీ వృద్ధి కేవలం 2 శాతంగానే ఉన్నది. ఏడాది క్రితం 5.4 శాతంగా ఉండటం గమనార్హం. దీంతో 11 నెలల కనిష్ఠానికి దిగజారినైట్టెంది. ఈ ఏడాది జనవరి-మార్చిలో 4 శాతంగా ఉన్నట్టు ఎన్ఎస్‌వో చెప్తున్నది. ఇదిలావుంటే ఈ ఏడాది మే నెలలో ఐఐపీ వృద్ధిరేటును ఎన్ఎస్‌వో సవరించింది. ముందుగా 1.2 శాతంగా ప్రకటించగా, దాన్నిప్పుడు 1.9 శాతానికి పెంచింది

# రాత్రి పూట యాలకుల పాలను తాగితే ఎన్నో లాభాలు.. కచ్చితంగా రోజూ తాగండి..!



యాలకులు మన వంట ఇంట్లో సుగంధ ద్రవ్యాలుగా ఎప్పటి నుంచో ఉన్నాయి. మసాలా వంటకాల్లో యాలకులను ఎక్కువగా వేస్తుంటారు. చికెన్, మటన్ తోపాటు శాకాహార మసాలా వంటకాలు, స్వీట్లలో యాలకులను ఉపయోగిస్తారు. యాలకులు మన వంట ఇంట్లో సుగంధ ద్రవ్యాలుగా ఎప్పటి నుంచో ఉన్నాయి. మసాలా వంటకాల్లో యాలకులను ఎక్కువగా వేస్తుంటారు. చికెన్, మటన్ తోపాటు శాకాహార మసాలా వంటకాలు, స్వీట్లలో యాలకులను ఉపయోగిస్తారు. దీంతో వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అయితే యాలకులను రాత్రి పూట పాలలో మరిగించి ఆ పాలను తాగాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. యాలకుల పాలను రోజూ తాగితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు క ల ు గ ు తా య ని అంటున్నారు. యాలకుల పాలను తాగడం వల్ల ట్రిప్టోఫాన్ లభిస్తుంది. ఇది ఒక అమైనో యాసిడ్. నిద్రను ప్రేరేపిస్తుంది. శరీరంలో సెరొటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తి అయ్యేలా చేస్తుంది. దీంతో ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. మైండ్ రిలాక్స్ అవుతుంది. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమి ఉన్నవారు రాత్రి పూట యాలకుల పాలను తాగితే ప్రయోజనం ఉంటుంది.

**మానసిక ఆరోగ్యానికి..**

యాలకుల పాలను తాగడం వల్ల నాడీ మండల వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గి డిప్రెషన్ నుంచి బయట పడతారు. మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. మెదడు చురుగ్గా మారి యాక్టివ్ గా ఉంటుంది. మరుసటి రోజు ఉత్తేజంగా పనిచేస్తారు. యాలకుల్లో అనేక సమ్మేళనాలు ఉంటాయి. ఇవి జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో గ్యాస్, కడుపు ఉబ్బరం, అజీర్తి నుంచి ఉపశమనం లభిస్తుంది. అసిడిటీ, కడుపు నొప్పి ఉన్నవారు ఈ పాలను తాగితే ఎంతగానో ప్రయోజనం లభిస్తుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. యాలకుల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగించడంలో సహాయం చేస్తాయి. దీంతో కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. అలాగే రోగ నిరోధక వ్యవస్థ పటిష్టంగా మారుతుంది. దీంతో సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

**బీపీ తగ్గేందుకు..**

యాలకుల్లో పొటాషియం, మెగ్నిషియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. ఇవి బీపీని నియంత్రించడంలో సహాయం చేస్తాయి. యాలకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. వీటిల్లో ఉండే ఫైబర్ కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. యాలకుల పాలను తాగడం వల్ల బీపీ నియంత్రణలో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. ఆక్సీకరణ ఒత్తిడికి గురి కాకుండా రక్షించుకోవచ్చు. గుండె సంబంధిత వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. ముఖ్యంగా గుండె పోటు రాకుండా ఉంటుంది. యాలకుల్లో సహజసిద్ధమైన యాంటీ మైక్రోబియల్, యాంటీ సెప్టిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల యాలకుల పాలను సేవిస్తే నోట్లో ఉండే బ్యాక్టీరియా నశిస్తుంది. నోటి దుర్వాసన తగ్గుతుంది. దంతాలు, చిగుళ్ల ఇన్ఫెక్షన్లు తగ్గిపోతాయి. దంతాలు, చిగుళ్లు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి.

**వాపులు, నొప్పులకు..**

యాలకుల పాలలో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్ల శరీరంలో ఉండే వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ సమస్య తగ్గుతుంది. కీళ్ల నొప్పులు, వాపుల నుంచి ఉపశమనం లభిస్తుంది. యాలకుల పాలలో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. క్యాల్షియం, ప్రోటీన్లు, విటమిన్ డి, అనేక రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవన్నీ మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాలు రాకుండా రక్షిస్తాయి. ఎముకలు ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. మెటబాలిజం పెరిగేలా చేస్తాయి. దీంతో క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు మరిగిస్తే యాలకుల పాలు రెడీ అవుతాయి. కాస్త తేనె కలిపి తాగితే రుచిగా ఉండడమే కాదు, అనేక ప్రయోజనాలను అందిస్తాయి

# పోషకాలకు దెబ్బ!


వాతావరణంలో పెరుగుతున్న వేడి, గాలిలో అధికం అవుతున్న కార్బన్ డయాక్సైడ్‌లు పంట పెరుగుదలనే కాదు అందులోని పోషకాలనూ దెబ్బతీస్తున్నాయని ఇటీవల ఓ పరిశోధన వెల్లడించింది. బ్రిటన్‌లో రానున్న రోజుల్లో అంచనా వేసిన వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఉష్ణోగ్రత, కార్బన్ డయాక్సైడ్‌లు ఉండేలా ఏర్పాటు చేశారు. ఆ రకంగా పండిన పంటల్లో ఎలాంటి పోషకాలు ఉంటాయన్నది హై పర్ఫామెన్స్ లిక్విడ్ క్రొమెటోగ్రఫీలాంటి అత్యంత సునిశిత పద్ధతుల్ని వాడి తెలుసుకున్నారు.పరిశోధనలో భాగంగా పాలకూర, అరుగుల ఆకు, కాలేలాంటి ఆకుకూరల్ని ప్రధానంగా పండించారు. వీటిలోని విటమిన్లు, మినరల్లు, ఫ్లేవనాయిడ్లు, యాంటి ఆక్సిడెంట్లలాంటి వాటిని పరిశీలించారు. ఈ నివేదిక ప్రకారం కిరణ జన్య సంయోగ క్రియ మొదలు%% పెరుగుదల, పోషకాల నిల్వ లాంటి అన్ని విషయాల్లోనూ పంటలపై వాతావరణ మార్పుల ప్రభావం ఎక్కువగానే ఉన్నట్టు తేలింది.ఈ వాతావరణంలో మొక్కలు త్వరగా, పెద్దగా పెరుగుతున్నాయి. కానీ కొద్దికాలం గడిచేలోపే వాటిలోని యాంటి ఆక్సిడెంట్లు, క్యాల్షియంలాంటి అత్యవసర పోషకాలు సన్నగిల్లుతున్నాయి. కాబట్టి మునుముందు మనకు ఆహారం ద్వారా అందే పోషకాల స్థాయి మీదా భూతాపం ప్రభావాన్ని తప్పక పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నమాట

# మోల్డ్ టెక్ ఆశాజనకం




మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మోల్డ్ టెక్ ఆశాజనకంమోల్డ్ టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను సంస్థ రూ.30 కోట్ల నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.22.22 కోట్ల లాభంతో పోలిస్తే 37 శాతం ఎగబాకింది.అలాగే కంపెనీ విక్రయాలు 21 శాతం ఎగబాకి రూ.241.15 కోట్లకు చేరుకున్నాయి

# మీకు థైరాయిడ్ సమస్య ఉందా..? అయితే ఈ ఆహారాలను తినండి..!



పస్తుతం చాలా మంది థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. ఎక్కువ శాతం మందికి అయోడిన్ లోపం కారణంగానే ఇది వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం చాలా మంది థైరాయిడ్ సమస్యతో బాధపడుతున్నారు. ఇందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. ఎక్కువ శాతం మందికి అయోడిన్ లోపం కారణంగానే ఇది వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. థైరాయిడ్ రెండు రకాలుగా ఉంటుందన్న విషయం తెలిసిందే. థైరాయిడ్ గ్రంథి అవసరం అయిన దాని కన్నా అధిక మొత్తంలో హార్మోన్లను విడుదల చేస్తే అప్పుడు ఆ స్థితిని హైపర్ థైరాయిడిజం అంటారు. అదే అవసరం అయిన దాని కన్నా తక్కువ మొత్తంలో హార్మోన్లను స్రవిస్తే ఆ స్థితిని హైపో థైరాయిడ్ అంటారు. రెండు రకాల్లోనూ పలు రకాల లక్షణాలు మనకు కామన్‌గా కనిపిస్తాయి. అయితే ఏ థైరాయిడ్ ఉన్నా సరే అందుకు జీవితాంతం మందులను వాడాల్సి ఉంటుంది. తరచూ పరీక్షలు చేయించుకుంటూ డాక్టర్ సూచన మేరకు మందులను వాడుకోవాలి. అలాగే కొన్ని రకాల ఆహారాలను తరచూ తింటుండాలి. దీంతో థైరాయిడ్ కంట్రోల్‌లో ఉంటుంది.

**పండ్లు, కూరగాయలు..**

థైరాయిడ్ ఉన్నవారు తాజా పండ్లు, కూరగాయలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. ప్రోటీన్లు, తృణ ధాన్యాలను కూడా అధికంగానే తీసుకోవాలి. ప్రాసెస్ చేయబడిన ఆహారాలు, శీతల పానీయాలు, అనారోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను తినకూడదు. థైరాయిడ్ గ్రంథి సరిగ్గా పనిచేయాలంటే అందుకు పలు పోషకాలు అవసరం అవుతాయి. సెలీనియం, జింక్, ఐరన్, పలు రకాల బి విటమిన్లు థైరాయిడ్‌కు మేలు చేస్తాయి. కనుక ఈ పోషకాలు ఉండే ఆహారాలను తరచూ తినాలి. థైరాయిడ్ ఉన్నవారికి ఆ సమస్య నియంత్రణలో లేకపోతే గొంతు దగ్గర వాపులు కనిపిస్తాయి. ఈ లక్షణం కనిపిస్తే వెంటనే అలర్ట్ అయి కచ్చితంగా చికిత్స తీసుకోవాలి. లేదంటే ప్రాణాంతకం అవుతుంది

**అయోడిన్ ముఖ్యం..**

థైరాయిడ్ కంట్రోల్‌లో ఉండేందుకు డాక్టర్లు ఇచ్చే మెడిసిన్లను సాధారణంగా ఉదయం పరగడుపునే వేసుకోవాలి. తరువాత కనీసం 30 నిమిషాలు వేచి ఉండాలి. ఆ తరువాతే ఆహారాలను తినాలి. దీంతో థైరాయిడ్ పనితీరు మెరుగు పడుతుంది. అలాగే థైరాయిడ్ సమస్య ఉన్నవారి కోసం డాక్టర్లు పోషకాలు ఉండే ట్యాబ్లెట్లను ఇస్తారు. వాటిని డాక్టర్ సూచన మేరకు వాడుతున్నా ఫలితం ఉంటుంది. దీంతో థైరాయిడ్ ను గ్రంథి సక్రమంగా ఉపయోగించుకుంటుంది. థైరాయిడ్ నియంత్రణలోకి వస్తుంది. థైరాయిడ్ ఉన్నవారు అయోడైజ్డ్ సాల్ట్‌ను వాడాలి. దీంతో అయోడిన్ లభిస్తుంది. థైనాయిడ్‌కు ఇది మేలు చేస్తుంది. అలాగే కాడ్, ట్యూనా, సాల్మన్ వంటి చేపలను, ఆల్చిప్పలు, రొయ్యలు వంటి ఆహారాలను తింటున్నా మేలు జరుగుతుంది.

**పాలు, పాల ఉత్పత్తులు..**

థైరాయిడ్ ఉన్నవారు పెరుగు, పాలు, పనీర్ వంటి ఆహారాలను తీసుకుంటే అయోడిన్‌ను పొందవచ్చు. దీంతో థైరాయిడ్ పనితీరు మెరుగు పడుతుంది. కోడిగుడ్లలోనూ సెలీనియం, అయోడిన్ ఉంటాయి. రోజుకు ఒక ఉడకబెట్టిన గుడ్డును తింటుంటే ఫలితం ఉంటుంది. సెలీనియం అధికంగా ఉండే బ్రెజిల్ నట్స్, పప్పు దినుసులు, పొద్దు తిరుగుడు విత్తనాలను తింటున్నా కూడా మేలు జరుగుతుంది. గుమ్మడికాయ విత్తనాలు, జీడిపప్పు, శనగలు, తృణ ధాన్యాలు, చికెన్‌లో జింక్ అధికంగా ఉంటుంది. ఇది థైరాయిడ్ పనితీరును మెరుగు పరుస్తుంది. కనుక వీటిని కూడా తరచూ తింటుంటే ఉపయోగం ఉంటుంది. థైరాయిడ్ పనితీరు మెరుగు పడేందుకు ఐరన్ అధికంగా ఉండే పాలకూర, తోటకూర, మునగాకులు, ఖర్జూరాలు, బెల్లం, దానిమ్మ పండ్లు వంటి ఆహారాలను తింటుండాలి. ఇలా ఆహారాలను తింటుంటే థైరాయిడ్‌ను పూర్తిగా అదుపులో ఉంచుకోవచ్చు

## వర్షాకాలంలో ఈ కూరగాయలు అస్సలు తినొద్దు.. ఎందుకంటే..!




కాయగూరలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. శరీరానికి అన్ని రకాల పోషకాలను అందిస్తాయి. వాటిలో అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అందుకే కూరగాయలను క్రమం తప్పకుండా తీసుకుంటే అనేక వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే వర్షాకాలంలో మాత్రం కొన్ని రకాల కూరగాయలను తినడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు కాయగూరలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. శరీరానికి అన్ని రకాల పోషకాలను అందిస్తాయి. వాటిలో అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. అందుకే కూరగాయలను క్రమం తప్పకుండా తీసుకుంటే అనేక వ్యాధుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అయితే వర్షాకాలంలో మాత్రం కొన్ని రకాల కూరగాయలను తినడం ఆరోగ్యానికి మంచిది కాదని నిపుణులు చెబుతున్నారు. తినకూడని ఆ కూరగాయలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..కాలీఫ్లవర్‌జివర్షాకాలంలో కాలీఫ్లవర్ తినడం మంచిది కాదు. ఎందుకంటే తేమ కారణంగా బ్యాక్టీరియా, పురుగులు పెరిగే అవకాశం ఉంది. కాలీఫ్లవర్‌లో తేమ ఎక్కువగా ఉండటం వలన అది త్వరగా పాడైపోయే అవకాశం ఉంది. అది కడుపులో ఇన్ఫెక్షన్లకు కారణం అయ్యే ప్రమాదం ఉంది.వంకాయవంకాయలలో వర్షాకాలంలో పురుగులు పడుతాయి. కోసేటప్పుడు పురుగులు కనిపిస్తే మొత్తం వంకాయను పారవేయాలి. కొన్ని పురుగులు ఉడికించిన తర్వాత కూడా జీవించగలుగుతాయి. వాటిని తింటే ఆరోగ్యంపై ప్రభావం పడుతుంది. టేప్‌వార్మ్ లాంటి సూక్ష్మజీవుల లార్వా మెదడులోకి ప్రవేశిస్తే అది ప్రాణాంతక పరిణామాలకు దారితీస్తుంది.బీరకాయజిబీరకాయ వర్షాకాలంలో సమృద్ధిగా లభిస్తుంది. ఇది ఫైబర్ పరంగా గొప్ప కూరగాయ. కానీ వర్షాకాలంలో ఇది కీటకాలతో ఉంటుంది. దానిలో ఉండే పురుగులు చాలా చిన్నవిగా ఉంటాయి. ఈ పురుగులను తింటే అవి శరీరంలోకి ప్రవేశించి మెదడుకు చేరుతాయి. ఇవి తీవ్ర అనారోగ్య సమస్యలకు దారితీస్తాయి.క్యాబేజీజిక్యాబేజీ పొరల మధ్య టేప్‌వార్మ్‌లు దాక్కునే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ పురుగులు చాలా వేగంగా పెరుగుతాయి. వాటిని శుభ్రం చేసి నిపుణులు సూచిస్తున్నారు.క్యాప్సికమ్‌జిక్యాప్సికమ్ లోపలి భాగంలో టేప్‌వార్మ్‌లు ఉండవచ్చు. సరిగ్గా కడగకపోతే టేప్‌వార్మ్ గుడ్లు శరీరంలోకి ప్రవేశించి ఇన్ఫెక్షన్‌కు కారణమవుతాయి. కాబట్టి వర్షాకాలంలో పై కూరగాయల జోలికి వెళ్లకుండా ఉండటమే ఉత్తమం. ఒకవేళ తప్పనిసరైతే జాగ్రత్త శుభ్రం చేసుకుని, ఉడికించుకోవాలి.




# ‘సైయారా’ సంచలనం.. 13 రోజుల్లో ‘ఛావా’ రికార్డు బద్దలు!

బాలీవుడ్‌తో పాటు ప్రస్తుతం ఇండియా అంతటా వినిపిస్తున్న పేరు సైయారా చిన్న సినిమాగా విడుదలైన ఈ చిత్రం ఇండియాతో పాటు వరల్డ్ వైడ్‌గా సంచలనాలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ చిత్రం రూ. 400 కోట్ల వసూళ్లను రాబట్టి విజయవంతంగా దూసుకెళుతుంది. ఇదిలావుంటే తాజాగా ఈ చిత్రం మరో రికార్డును అందుకుంది. ఓవర్సీస్‌లో ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సొంతం చేసుకున్న బాలీవుడ్ సినిమాగా రికార్డు నెలకొల్పిన ‘ఛావా’ సినిమా రికార్డును బీట్ చేసింది సైయారా. ఛావా సినిమా వరల్డ్ వైడ్‌గా రూ.91 కోట్లు వసూళ్లను రాబట్టి.. ఈ ఏడాది టాప్‌లో ఉండగా.. కేవలం 13 రోజుల్లోనే ఈ రికార్డును అధిగమించి రూ.94 కోట్లతో దూసుకుపోతుంది సైయారా. ఈ చిత్రానికి మోహిత్ సూరి దర్శకత్వం వహించగా.. ఆహాన్ పాండే, అనిత్ పడ్డా హీరో హీరోయిన్‌లుగా నటించారు.



# మీ అందరి ప్రేమ వల్లే ఈ విజయం


## కింగ్‌డమ్ సక్సెస్ మీట్‌లో విజయ్ దేవరకొండ

కింగ్‌డమ్ మూవీ నేడు థియేటర్స్ లో విడుదలై మంచి టాక్ సొంతం చేసుకుంది. విజయ్ దేవరకొండ హీరోగా నటించిన కింగ్‌డమ్ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండతో పాటు భాగ్యశ్రీ బోర్సే, సత్యదేవ్ మలయాళ నటుడు వెంకటేష్ నటించారు. శ్రీకర స్టూడియో సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా ఈ సినిమాను నిర్మించారు. జులై 31న గ్రాండ్ గా విడుదలైన ఈ సినిమాకు అన్ని ఏరియాల నుంచి పాజిటివ్ టాక్స్ వస్తున్నాయి. ఇప్పటికే సినిమా బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకోవడంతో చిత్రయూనిట్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రేక్షకుల దగ్గర నుంచి సినీసెలబ్రెటీలు కూడా ఈ సినిమా పై ప్రశంసలు కురిపిస్తున్నారు. సినిమాకు బ్లాక్ బస్టర్ టాక్ రావడంతో చిత్రయూనిట్ సక్సెస్ మీట్ ను ఏర్పాటు చేశారు. విజయ్ దేవరకొండ నటిస్తున్న లేటెస్ట్ మూవీ కింగ్ డమ్. ఈ సినిమా జులై 31 న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రేక్షకులంతా ఎంతగానో ఎదురుచూసిన చిత్రం ఇది. ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే, సత్యదేవ్, వెంకటేష్ ముఖ్య పాత్రలు పోషించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. మొదటి షో నుంచి కింగ్ డమ్ పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. తాజాగా ఈ సినిమా బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది.



# అరె ఎప్పుడురా ! రచ్చ మూవీలో నటించిన ఈ పాప.. ఇప్పుడు హీరోయిన్


టాలీవుడ్‌లో బాల నటీనటులుగా ఫిల్మ్ జర్నీ ప్రారంభించి.. తర్వాత హీరోలుగా, హీరోయిన్లుగా ఎదుగుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. తేజ సజ్జా, కావ్య కల్యాణ్ రామ్ వంటి వాళ్లు ఈ మార్పుకు బెస్ట్ ఎగ్జాంపుల్స్. ఇప్పుడు అదే లిస్ట్‌లోకి చేరింది మరో పేరు విశికా కోటా. విశికా 2012లో వచ్చిన రామ్ చరణ్ నటించిన ‘రచ్చ’ సినిమాలో బాల నటిగా నటించింది. ఈ సినిమాలో తాను చేసిన క్యారెక్టర్ ఎవరిదో తెలుసా? తమన్నా చిన్ననాటి పాత్ర! ఆ పాత్రలో అందర్నీ ఆకట్టుకున్న విశికా, ఇప్పుడు ఫుల్ లెంగ్త్ హీరోయిన్‌గా టాలీవుడ్‌లో అడుగులు వేస్తోంది. ఇప్పటికే ‘ఏందిరా ఈ పంచాయితీ’, ‘సగిలేటి కథ’ వంటి సినిమాల్లో హీరోయిన్‌గా నటించిన విశికా, మరోవైపు కీలక పాత్రలతో కూడా తెరపై కనిపిస్తోంది. చిన్నతనంలో సినిమాల్లో నటించిన అనుభవం ఆమెకు ఇప్పుడు ఓ బలంగా మారింది. సన్ని డియోల్ నటించిన జాట్ అనే హిందీ సినిమాలోనూ మంచి పాత్ర పోషించింది. ఓదెల 2లోనూ విశికా కనిపించింది. ఓ ఇంటర్వ్యూలో విశికా మాట్లాడుతూ..“రచ్చ సినిమా టైమ్‌కి నేను చరణ్‌ను గానీ, తమన్నాను గానీ కలవలేను. వాళ్లు నా సీన్స్ షూట్ చేసే సమయంలో సెట్లో లేరు. అందుకే ఇప్పుడు వాళ్లు నన్ను చూస్తే.. గుర్తుపట్టే ఛాన్స్ కూడా ఉండదు” అని చెప్పారు. 1998 జూలై 19న హైదరాబాద్‌లో జన్మించిన విశికా, చదువు పూర్తి చేసిన తర్వాత నటన పట్ల ఆసక్తి పెరిగి ఫుల్‌టైమ్‌గా సినిమాల్లోకి వచ్చిందట. కేవలం గ్లామర్ పాత్రలకే కాకుండా, నటనకు స్కోప్ ఉన్న రోల్స్‌కి మొదటి ప్రాధాన్యం ఇస్తోంది. అయితే స్క్రీన్‌పై ఎంత బాగా కనిపించినా%%% సోషల్ మీడియా మీద మాత్రం మరింత స్టైలిష్‌గా, హాట్‌గా కనిపిస్తోంది ఈ బ్యూటీ. తరచూ గ్లామర్ ఫోటోషూట్లు పోస్ట్ చేస్తూ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను పెంచుకుంటోంది. ఈ తెలుగు అమ్మాయికి టాలెంట్ ఉన్నదని, మంచి అవకాశాలు రావాలని నెటిజన్లు కామెంట్స్‌తో సపోర్ట్ చేస్తున్నారు.





# మయసభ ట్రైలర్.. స్నేహితులు, రాజకీయ ప్రత్యర్థులుగా మారితే..

ప్రేక్షకులకు విభిన్నమైన కంటెంట్‌ను అందించడంలో ముందున్న ఓటీటీ ప్లాట్‌ఫామ్ సోనీ లివ్. ఇప్పుడు రాజకీయ థ్రిల్లర్ వెబ్‌సిరీస్ ‘మయ సభ’ ను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. “రైజ్ ఆఫ్ ది టైటాన్స్” అనేది ఈ సిరీస్ ట్యాగ్ లైన్. సీనియర్ దర్శకుడు దేవా కట్టా దర్శకత్వంలో రూపొందిన ఈ సిరీస్ ఆగస్టు 7 నుంచి సోనీ లివ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ వెబ్ సిరీస్‌కి నిర్మాతలుగా విజయ్ కృష్ణ లింగమనేని, శ్రీహర్ష వ్యవహరించగా, హిట్ మ్యాన్ – ప్రూడోస్ ప్రొడక్షన్స్ ఎల్‌ఎల్‌పి బ్యానర్‌పై తెరకెక్కింది. ముఖ్య పాత్రల్లో ఆది పినిశెట్టి, చైతన్య రావు, దివ్య దత్తా, సాయికుమార్, శత్రూ, శ్రీకాంత్ అయ్యంగార్, తన్య రామచంద్రన్, రవీంద్ర విజయ్ తదితరులు నటించారు. ఈ కథకు ప్రేరణగా ఏపీ రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన నేతలు చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి మధ్య ఉన్న స్నేహం, అనంతరం వారిద్దరి మధ్య ఏర్పడిన రాజకీయ విరోధతను తీసుకున్నట్టు దేవా కట్టా తెలిపారు. అయితే ఇది పూర్తిగా కల్పితమైన కథేనని, కొన్ని సంఘటనలు మాత్రం కాల్పనికంగా మలిచామని ఆయన స్పష్టం చేశారు. ఒకే లక్ష్యంతో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఇద్దరు స్నేహితులు, తర్వాత దారి మార్చుకొని విడిపోయిన సందర్భాలను బలంగా చూపించనున్నట్టు చెప్పారు.తాజాగా విడుదలైన ట్రైలర్ పలు సంచలనాత్మక డైలాగ్‌లతో సోషల్ మీడియాలో దుమారం రేపుతోంది. ఇద్దరు స్నేహితులు రాజకీయ ప్రత్యర్థులుగా ఎలా మారారన్న పాయింట్‌తో ఈ వెబ్ సిరీస్‌ని రూపొందించారు. ట్రైలర్‌లోని సన్నివేశాలు, డైలాగ్స్ ఆకట్టుకునేలా ఉన్నాయి. జీవితంలో ఏదో సాధించాలి, ప్రజలకు అండగా నిలబడాలనే లక్ష్యంతో రాజకీయాల్లో అడుగు పెట్టిన ఇద్దరు స్నేహితుల ప్రయాణం ఎలా సాగింది? కలిసి తిరిగిన వారు రాజకీయ గమనంలో ప్రత్యర్థులుగా మారడానికి కారణాలు ఏంటి? ఇద్దరి గొప్ప స్నేహితుల మధ్య ఉండే స్నేహం, మానసిక సంఘర్షణ.. పొలిటికల్ జర్నీలో వారు ఎదుర్కొన్న పరిస్థితులను భావోద్వేగంగా మయసభ వెబ్ సిరీస్‌లో ఆవిష్కరించనున్నట్టు తెలుస్తుంది.



# బాణామతి బ్యాక్‌డ్రాప్‌లో ‘చేతబడి’ సినిమా

శ్రీ శారద రమణా క్రియేషన్స్ బ్యానర్‌పై నంద కిషోర్ నిర్మిస్తున్న సినిమా ‘చేతబడి’. కొత్త దర్శకుడు సూర్యాస్ ఈ మూవీని నిజజీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కించారు. తాజాగా లుక్ రిలీజ్ చేయడంతో పాటు చిత్ర విశేషాలని దర్శకుడు మీడియాతో పంచుకున్నాడు. చేతబడి.. 16వ శతాబ్దంలో మన దేశంలో పుట్టింది. రెండు దేశాలు కొట్టుకోవాలన్న రెండు దేశాలు కలవాలన్నా.. ఒక బలగం ఉండాలి. కానీ ఒక చెడు శక్తితో మనిషిని కలవకుండా అతన్ని చంపే విద్యే చేతబడి. అది ఎంత భయంకరంగా ఉంటుందో ఇప్పటికే చాలా సినిమాల్లో చూపించారు. ఇందులో చాలా విభిన్నంగా చూపిస్తున్నాం. మన శరీరంలో ప్రతిదానికి ఓ ప్రాణం ఉంటుంది. జుట్టుకు కూడా ఒక ప్రాణం ఉంటుంది. ఆ వెంట్రుకల ఆధారంగానే ఈ సినిమా ఆధారపడి ఉంటుందని సూర్యాస్ తెలిపాడు. 1953 గిరిడ అనే గ్రామంలో యదార్థ సంఘటన ఆధారంగా చేసుకుని ఈ కథని సిద్ధం చేశారు. సీలేరు అనే గ్రామంలో 200 సంవత్సరాల క్రితం వెదురు బొంగులు చాలా దట్టంగా ఉంటాయి. వర్షం పడినా అవి నెలలోకి దిగవు. అలాంటి మట్టిలో బతికున్న నల్లకోడిని పెట్టి అమావాస్య రోజు బాణామతి చేస్తే ఎలా ఉంటుంది అనేది ఇందులో చూపించబోతున్నామని దర్శకుడు సూర్యాస్ చెప్పుకొచ్చాడు.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332